FOR ADS.....
ఆకాంక్ష
CONTACT: 8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :215 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 29 - మార్చి - 2026

## 5 కోట్ల ఆంధ్రుల కలల రాజధాని - అమరావతి చట్టబద్ధతకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం




**విభజన చట్టంలోని సెక్షన్ 5లోని సబ్‌సెక్షన్ 2లో 'ఎట్ అమరావతి' పదం చేర్చాలని తీర్మానం**

**అమరావతి చట్టబద్ధతకు అనుగుణంగా విభజన చట్టంలో సవరణ చేయాలని తీర్మానించిన సీఎం చంద్రబాబు**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానాన్ని శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు స్వయంగా ప్రవేశపెట్టారు. అమరావతి చట్టబద్ధతకు అనుగుణంగా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతూ సీఎం తీర్మానం ప్రవేశపెట్టారు. విభజన చట్టంలోని సెక్షన్ 5లోని సబ్‌సెక్షన్ 2లో ' మిగతా..2లో

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ.. రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం..శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి



**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.**

**207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది.**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా మిగతా..2లో

## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై బండి సంజయ్ స్పందన




★ ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుందని...

★ కొత్త పార్టీ పెట్టాలనే కవిత ఆలోచనను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కవిత పార్టీపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుందని... అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో రాబోయే కొత్త సమీకరణాలకు ఇది సంకేతమని అన్నారు. కొత్త పార్టీ పెట్టాలనే కవిత ఆలోచనను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఆయన విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి కేసీఆరే ప్రధాన కారణమని

# హరీశ్ రావు సోదరుడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు

● హరీశ్ రావు తమ్ముడు మహేశ్వర్ రావు ఇసుక మాఫియా నడిపారని శాసనసభలో ఆరోపించారు.

● సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారు.

● ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు.




హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సోదరుడిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు తమ్ముడు మహేశ్వర్ రావు ఇసుక మాఫియా నడిపారని శాసనసభలో ఆరోపించారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని అన్నారు. శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మాజీ ఎంపీ సంతోష్ రావు, ఆయన తండ్రి రవీందర్ రావులపై విచారణ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధమని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో పాటు అన్నింటిపై మిగతా..2లో

## మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును ప్రస్తావిస్తూ హరీశ్ రావు ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.**

**"అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?" అని మండిపడ్డారు.**

**"నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయండి.**

హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అసెంబ్లీ సాక్షిగా ధ్వజమెత్తారు. సర్వే నంబర్ 62, 63లలో జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని ఆయన ఆరోపించారు. మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చినా, లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన




నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును ప్రస్తావిస్తూ హరీశ్ రావు ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. చిన్న తప్పు చేశారనే నెపంతో మహిపాల్ రెడ్డి తమ్ముడిని రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి

## దీదీ చేసేవన్నీ 'విక్టిమ్ కార్డ్' రాజకీయాలు బంగాల్ నుంచి తొలగించండి




★ టీఎంసీ ప్రభుత్వంపై ఛార్జ్ షీట్ విడుదల చేసిన అమిత్ షా

★ మమతా బెనర్జీ బాధితురాలిగా నటిస్తున్నారంటూ ఎద్దేవా

ఢిల్లీ: బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. మమత ఎప్పుడూ బాధితురాలిగా (విక్టిమ్ కార్డు పొలిటిక్స్ ) నటిస్తుంటారని ఆరోపించిన ఆయన, దీదీ ఎత్తుగడలను బంగాల్ ప్రజలు ఇప్పుడు బాగా అర్థం చేసుకున్నారని అన్నారు. శనివారం అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వంపై ఛార్జిషీటు విడుదల

## తమిళనాడులో డీఎంకే 164, కాంగ్రెస్ 28 స్థానాల్లో పోటీ ఇతర మిత్రపక్షాలకు 42 సీట్లు కేటాయింపు

❖ 164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన డీఎంకే-

❖ కాంగ్రెస్‌కు 28 స్థానాలు కేటాయింపు

❖ కొళత్తూరు నుంచి స్టాలిన్, చేపాక్-ట్రిప్లికేన్ నుంచి ఉదయనిధి స్టాలిన్ పోటీ

❖ బోడినాయకనూర్ నుంచి పోటీ చేయనున్న మాజీ సీఎం పన్నీర్‌సెల్వం

ఢిల్లీ : ఏప్రిల్ 23న జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు అధికార డీఎంకే 164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం



స్టాలిన్ మరోసారి కొళత్తూరు నుంచే పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తిరిగి చేపాక్-ట్రిప్లికేన్ నుంచి బరిలో దిగుతున్నారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులై, ఇటీవల డీఎంకేలో చేరిన మాజీ సీఎం ఓ. పన్నీర్‌సెల్వంకు ఆయన సిట్టింగ్ స్థానమైన బోడినాయకనూర్ నుంచే డీఎంకే టికెట్ ఖరారు చేసింది.

### సీట్ల పంపకం జరిగిందిలా!

సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌కు నాయకత్వం వహిస్తున్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు , వీసీకే, డీఎండీకే, తదితర పార్టీలతో సీట్ల పంపకాలను పూర్తి చేసింది. ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు మిగతా..2లో

## మోదీ- ట్రంప్ ఫోన్‌కాల్ లో మస్క్ ఉన్నారా క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

● మోదీట్రంప్ మధ్య జరిగిన కాల్‌లో మూడో వ్యక్తి లేరని స్పష్టం

● మస్క్ పాల్గొన్నట్లు వచ్చిన వార్తలను ఖండించిన కేంద్రం



ఢిల్లీ : పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ సంభాషణలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నారన్న వార్తలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. మార్చి 24న జరిగిన ఈ ఫోన్ కాల్‌లో కేవలం మోదీ, ట్రంప్ మాత్రమే పాల్గొన్నారని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. "ఈ వార్త మా దృష్టికి వచ్చింది. ఆ రోజు జరిగిన ఫోన్ సంభాషణలో ఈ ఇద్దరు నేతలే ఉన్నారు. పశ్చిమాసియా పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోవడానికి అది ఒక అవకాశం మాత్రమే" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ఇటీవల ఓ అంతర్జాతీయ మీడియా ప్రచురించిన కథనం ప్రకారం, మస్క్ ఆ కాల్‌లో పాల్గొన్నారని, మిగతా..2లో

## పొరపాటున ఏ తుగ్లక్ వచ్చినా అమరావతిని మార్చలేరు




★ రాజధాని అమరావతి వల్ల ఎంతోమంది జీవితాలు మారాయి

★ కియా పరిశ్రమ వచ్చాక అనంతపురం ఐదో స్థానంలోకి వచ్చింది

★ హార్టికల్చర్ ద్వారా రాయలసీమ అభివృద్ధి

# ఇకపై రాజధాని అమరావతికి ఇబ్బందులు ఉండవు

▶▶ రాజధాని అమరావతికి ఇకపై ఎలాంటి ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

▶▶ తెలుగువారిని గతంలో 'మదరాసీలు' అని పిలిచేవారని..

▶▶ టీడీపీ ఆవిర్భావం తర్వాత మదరాసీ అనే ముద్ర పోయిందని తెలిపారు.





అమరావతి, మార్చి 28: ప్రజా రాజధాని అమరావతి అని.. తీర్మానం ఆమోదం తర్వాత కేంద్రానికి పంపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏపీ అసెంబ్లీలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇకపై రాజధాని అమరావతికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. శాతవాహనులు అమరావతి నుంచే పాలన సాగించారని గుర్తుచేశారు. ఆ కాలం నాటి అమరావతి విశేషాలను బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలుగువారిని గతంలో 'మదరాసీలు' అని పిలిచేవారని.. మిగతా..2లో

## వైఎస్సార్సీపీ మళ్లీ రాదు వచ్చినా ఏం చేయలేదు

● రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు

● ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలుచుకుంటే బాధేస్తోంది

● అమరావతి తీర్మానంపై అసెంబ్లీలో మాట్లాడిన పవన్ కల్యాణ్

అమరావతి : భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని మార్చిన తెలుగువారికి ఇప్పుడు శాశ్వత రాజధాని రూపం లేకపోవటం బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి తీర్మానంపై మాట్లాడిన పవన్ కల్యాణ్, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నుంచి అమరావతికి జగన్ చేసిన అన్యాయం వరకూ వివరించారు. ప్రభుత్వం మారిన తర్వాత



అమరావతిపై కక్ష గట్టిన జగన్ మహిళల్ని రోడ్లపైకి ఈడ్చారని ఆరోపించారు. మహిళలకు మద్దతుగా అమరావతి వెళ్తే ముళ్ల కంచెలు వేసి అడ్డుకున్నారని తెలిపారు. అప్పట్లో అమరావతి చాలా ఆందోళనగా ఉండేదని గుర్తు చేశారు. చట్టసభలోని సభ్యులకే రక్షణ లేకపోతే బయటి ప్రజల పరిస్థితి గురించి ఏం చెబుతామని పవన్ ఆరోపించారు. జగన్ చేసిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అమరావతి ఏపీకి ఏకైక రాజధానిగా ఉంటుందని చెప్పామని, ప్రజలు అర్థం చేసుకుని కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకునే క్రమంలో అడుగు పడిందని తెలిపారు. చట్టసభలో ఇచ్చేది కేవలం హామీ కాదని, చిత్తశుద్ధితో అమలు చేయాల్సి ఒదేనని స్పష్టం చేశారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## 5 కోట్ల ఆంధ్రుల కలల రాజధాని - అమరావతి
# చట్టబద్ధతకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

ఎట్ అమరావతి (అమరావతిలో)' అన్న పదాన్ని చేర్చాలని తీర్మానించారు. సెక్షన్ 5కి సంబంధించి విభజన చట్టంలో ఇచ్చిన వివరణలో 'ఏపీ సీఆర్‌డీఏ చట్టం-2014 ప్రకారం నోటిఫై చేసిన కేపిటల్ సిటీ ప్రాంతాలతో సహా అమరావతి' అని చేర్చాలని ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం ఈ తీర్మానంపై పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం చంద్రబాబు సమాధానం చెప్పారు. రాజధాని అమరావతిపై చరిత్రాత్మక తీర్మానికి అసెంబ్లీ జైకొట్టింది. 5 కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతే అంటూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ సమ్మతి తర్వాత ఈ తీర్మానం పార్లమెంట్ ముందుకు వెళుతుంది. అక్కడ ఆమోదం పొందాక ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కుతుంది. మూడు ముక్కలాట లాంటి వైఎస్సార్సీపీ వికృత క్రీడకు తావు లేకుండా రాజధాని మార్చాలన్న ఆలోచన చేయడానికి కూడా వీల్లేకుండా అమరావతికి చట్టభద్రత వస్తుంది. నవ్యాంధ్ర శాశ్వత రాజధానిగా అమరావతి చిరస్థాయిగా నిలిచిపోతుంది. కేంద్రానికి తీర్మానం: అమరావతికి చట్టబద్దత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా అమోదించింది. తీర్మానం ఆమోదం అనంతరం శాసనసభను స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరవధికంగా వాయిదా వేశారు. సభ వాయిదా పడగానే చారిత్రాత్మక తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ కేంద్రానికి పంపించింది. తీర్మానాన్ని కేంద్ర హోంమంత్రి, లోక్ సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ లకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెంటనే పంపించారు. తీర్మానం ప్రతులను హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ పంపించారు. ఇక ఇబ్బందే ఉండదు: ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్దత కల్పిస్తే ఇక ఇబ్బంది ఉండదనే తీర్మానించామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజధానులు కోల్పోవటం విమర్శలు, వివక్షత, అవమానాలు తెలుగువాళ్లం దశాబ్దాలుగా భరిస్తూనే వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఏది చేసుకోవాలో తెలీని గందరగోళంలో ఉన్నామని వ్యాఖ్యానించారు. విభజన సమయంలో సమన్యాయం చేయాలని తాను కోరితే, ఇప్పటి వైఎస్సార్సీపీ నాయకుడు నాడు పార్లమెంటులో ఉండి కెమెరాలు నుంచి తప్పించుకు తిరిగాడని దుయ్యబట్టారు. అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి, హైదరాబాద్ లు దేశంలో ఒకటి రెండు స్థానాల్లో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని తేల్చిచెప్పారు. ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్దత కల్పిస్తే ఇక ఇబ్బంది ఉండదనే ఈ తీర్మానించామని వెల్లడించారు.

## దీదీ చేసేవన్నీ 'విక్టిమ్ కార్డ్ ' రాజకీయాలు
# బంగాల్ నుంచి వీజని తొలగించండి

చేస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "మమత బెనర్జీ ఎప్పుడూ బాధితురాలిగా నటిస్తూ రాజకీయాలు చేస్తుంటారు. కొన్ని సార్లు ఆమె కాలు విరగ్గొట్టుకుంటారు. మరికొన్ని సార్లు తలకు కట్టుకుంటారు. కొన్ని సార్లు అనారోగ్యానికి గురవుతారు. ఆపై మళ్లీ ఎన్నికల సంఘం ముందు నిలబడి ఆ సంస్థను దూషిస్తూ నిస్సహాయతను ప్రదర్శిస్తుంటారు. కానీ ఇప్పుడు ఈ విక్టిమ్ కార్డు రాజకీయాలను బంగాల్ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారు. అదే విషయాన్ని ఆమెకు చెప్పడానికి నేను ఇక్కడకు వచ్చాను. "

– అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

దేశంలో మరెక్కడా ఇలాంటి పరిస్థితి కనిపించలేదు. దీనికి కారణం ఏమిటో బంగాల్ ప్రజలకు మమతా బెనర్జీ సమాధానం చెప్పాలి. ఆమె ఎస్ ఐఆర్ పై ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఈ రోజు నేను బంగాల్ ప్రజలను అడుగుతున్నాను. దేశంలోకి చొరబడినవారు బంగాల్ భవిష్యత్ ను నిర్ణయించేందుకు మనం అనుమతించాలా? నేను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుంటున్నా, ఓటర్ల జాబితా నుంచే కాదు, దేశం నుంచి కూడా చొరబాటుదారులను వెళ్లగొట్టడమే బీజేపీ పార్టీ అజెండా" అని అమిత్ షా తేల్చిచెప్పారు. బంగాల్ లో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే! లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది. అంతేకాదు 45 రోజుల్లోగా సరిహద్దు వెంబడి కంచె వేయడానికి అవసరమైన భూమిని రాష్ట్ర బీజేపీ సర్కార్, కేంద్ర ప్రభుత్వానికి అందిస్తుంది. మేము కచ్చితంగా అక్రమ చొరబాట్లను అరికడతాం' అని అమిత్ షా పేర్కొన్నారు.ఇక ఇతర వర్గాలేవీ మిగిలి లేవా? ఓబీసీ హోదాను ఇకపై మతం ఆధారంగా నిర్ణయించాలా? అని ఆయన ప్రశ్నించారు. అంతేకాదు ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగదని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు వయోపరిమితి పెంపు

బీజేపీ అధికారంలోకి రాగానే, రిక్రూట్ మెంట్ కుంభకోణాల వల్ల ఏజ్ లిమిట్ దాటిపోయిన యువతకు 5 ఏళ్లపాటు వయోపరిమితి సడలింపు ఇస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ హయాం పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. ముఖ్యంగా యువతకు ఎస్ఎస్ సీ నియామకాల్లో అవకాశం కల్పిస్తామని అన్నారు.

### టీఎంసీని ఓడించాలి!

బంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీ రాష్ట్ర అధ్యకుడు సమీక్ భట్టాచార్యతో కలిసి, అమిత్ షా కోల్ కతాలో టీఎంపీ ప్రభుత్వంపై శనివారం ఛార్జిషీటు విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బంగాల్ ప్రజలు భయం, విశ్వాసాల్లో ఏదో ఒకదానిని ఎంచుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. టీఎంసీ అధికారంలోకి రావడానికి అబద్ధాలు, భయం, హింస మూలాధారాలుగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. దానికి వ్యతిరేకంగా బీజేపీ 2011 నుంచి పోరాడుతోందని అన్నారు. బంగాల్ నుంచి టీఎంసీని తొలగించాలని ప్రజలను ఆయన కోరారు. ఈసారి రాష్ట్రంలో బీజేపీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## హరీశ్ రావు సోదరుడిపై
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు

సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. విచారణలో నిజానిజాలు నిగ్గుతేల్చి శాసనసభలో నివేదికను పెడతామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. వద్దిరాజు రవిచంద్ర వంటి వారిని బీఆర్ఎస్ నాయకులు బెదిరించి తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు.

## మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై
# హరీశ్ రావు సంచలన ఆరోపణలు

నెల రోజులు జైల్లో పెట్టారని, మరి అంతకంటే పెద్ద అక్రమాలకు పాల్పడుతున్న మంత్రి సంస్థపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. "అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?" అని మండిపడ్డారు. తన ట్వీట్లపై మంత్రి పొంగులేటి 'మొరిగే కుక్కలు' అంటూ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అది కచ్చితంగా పొంగులేటి సంస్థేనని స్పష్టం చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని, అందుకే వెంటనే రాజీనామా చేసి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రభుత్వానికి ఒక అల్టిమేటం జారీ చేశారు. "నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజాలైతే మాత్రం వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సంచలన ప్రకటన చేశారు. ఈ సవాల్‌తో అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై బండి సంజయ్ స్పందన

బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. "కాళేశ్వరానికి కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపీ పెట్టుకుని మరీ ఆయనే దీనిని డిజైన్ చేశారు" అంటూ ఎద్దేవా చేశారు. ఆయన తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే ప్రాజెక్టు కుంగిపోయిందని, వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని మండిపడ్డారు. ఈ పాపమంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉందని బండి సంజయ్ మండిపడ్డారు. ప్రధాని మోదీపై విమర్శలు చేసే క్రమంలో రేవంత్ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ.. రూ.700 కోట్లతో
## ఓంకారేశ్వర ఆలయం..శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇకపై రాజధాని అమరావతికి ఇబ్బందులు ఉండవు

మొదటి పేజి తరువాయి

టీడీపీ ఆవిర్భావం తర్వాత మదరాసీ అనే ముద్ర పోయిందని చంద్రబాబు గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. విభజన సమయంలో సమన్యాయం కోసం తాము కోరినట్లు చంద్రబాబు చెప్పారు. ఆనాడు పార్లమెంట్‌లో జగన్ కనిపించకుండా దాక్కున్నారని విమర్శించారు. విభజన తర్వాత ఏపీలో కార్యాలయాలు లేవని, బస్సులో ఉండి పరిపాలన చేశామని ఆయన వెల్లడించారు. అమరావతిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలను కేవలం 9 నెలల్లోనే పూర్తి చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### అదే నా సంకల్పం...

సింగపూర్ సహకారంతో ఆ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరామని సీఎం తెలిపారు. 'ముందు దేశం బాగుండాలి.. అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి' అని అన్నారు. తెలుగు వాళ్లకు చెందిన



హైదరాబాద్, అమరావతి తొలి రెండు స్థానాల్లో ఉండాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు. విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు.

### ఆ రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం..

ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధాని అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తామని చెప్పారని.. కానీ రోజుకో మాట మార్చేసి ఊసరవెల్లి రాజకీయాలు చేశారని సీఎం విమర్శించారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేశారన్నారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చుని.. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులను సంప్రదించగా 58 రోజుల్లో 34 వేల ఎకరాలను రాజధాని కోసం ఇచ్చేశారన్నారు. రాజధానికి, రాష్ట్రానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం తెలిపారు. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వక్తులు తోటలకు నిప్పు పెట్టారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకుకు ఈమెయిళ్లు పెట్టారని ఫైర్ అయ్యారు. కానీ పవిత్రమైన మట్టి, నీరుతో ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని... అందుకే ఇది శాశ్వతంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# వైఎస్సార్సీపీ మళ్లీ రాదు - వచ్చినా ఏం చేయలేదు

మొదటి పేజి తరువాయి

ఒకటే నేల, ఒకటే రాష్ట్రం, ఒకటే జాతి : భూమి ఇచ్చిన చిన్న రైతులతో పాటు మిత్తల్ వంటి పారిశ్రామికవేత్తలు కూడా స్థిరత్వం అడుగుతున్నారని, మనం ఐక్యంగా ఉంటేనే ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని పవన్ కల్యాణ్ గట్టిగా చెప్పారు. మనం ప్రాంతీయ భావనలు పక్కన పెట్టి ఆంధ్రా అని చెప్పుకుందామని, ఒకటే నేల, ఒకటే రాష్ట్రం, ఒకటే జాతి అని బలంగా చెప్పాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎవరికి డబ్బులు ముఖ్యం కాదని, ఎవరి ఆదాయమార్గాలు వారికున్నాయని చెప్పారు. నేరమయ రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, అప్పుడే ఏపీకి పెట్టుబడులు బలంగా వస్తాయని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని స్వయంగా చూశామని, చంద్రబాబుని అప్పుడు కొందరు విమర్శించినా ఇప్పుటి తరం ఆనాటి పనుల ఫలితాన్ని అనుభవిస్తోందని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ గతంలో ఉండేవని సైబరాబాద్ మాత్రం చంద్రబాబు సృష్టించిన నగరమని కొనియాడారు. ఇలాంటి నమ్మకంతోనే అమరావతి శాశ్వత రాజధాని అన్న తీర్మానానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు : "పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం వల్ల ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలుచుకుంటే బాధేస్తోంది. రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు, ఆంధ్ర వేరు అనే భావన లేదు తెలుగునేల అనే భావన ఉండేది. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవు. చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి, కార్యాలయాలు లేకపోయినా పనిచేశారు. టెంట్ వేసుకొని అయినా పని చేద్దామని చంద్రబాబు ఆశించారు. ఏపీపై ఉన్న గౌరవం వల్లే 2014లో చంద్రబాబుకు మద్దతు ఇచ్చాను. చంద్రబాబు లాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటే బాగుంటుందని మద్దతు ఇచ్చాను. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33 వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక అమరావతిపై కక్ష కట్టారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైఎస్సార్సీపీ హయాంలో హింసించారు" అని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. "వైఎస్సార్సీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని సమస్యను పరిష్కరించకపోగా, కఠినం చేశారు. వైఎస్సార్సీపీ మళ్లీ వస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్సీపీ మళ్లీ రాదు, వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనందరం ఒకే మాటపై కట్టుబడి ఉండాలి. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు, దీనికి కట్టుబడి ఉన్నాం. భాషాప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికిన రాష్ట్రమే రాజధాని లేకుండా తయారైంది. ప్రాంతీయ విద్వేషాలు ఎందుకు, మనమంతా ఆంధ్రులం.

# పొరపాటున ఏ తుగ్లక్ వచ్చినా అమరావతిని మార్చలేరు

మొదటి పేజి తరువాయి

అమరావతి : భవిష్యత్తులో ఏ తుగ్లక్ లాంటి వ్యక్తి వచ్చినా రాజధానిగా అమరావతిని మార్చలేని విధంగా రక్షణ కల్పిస్తున్నామని మంత్రి లోకేశ్ అన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా అన్ని జిల్లాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అమరావతిపై నేటి తీర్మానం ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు శాస్వత పునాది వేసి, వారి ఆశలకు రెక్కలు తొడుగుతోందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే సమావేశం అంటూ జై అమరావతి అని సభలో లోకేశ్ నినదించారు. జెన్‌జీ తరం గుర్తించుకోవాలి: ఏపీకి, అమరావతికి జగన్ అనుకూలమో వ్యతిరేకమో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వాలు కొనసాగుతూ, అభివృద్ధిని కూడా కొనసాగిస్తాయని కానీ వైఎస్సార్సీపీ మాత్రం రాష్ట్రాన్ని తీవ్రంగా విధ్వంసం చేసిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, ముఖ్యంగా జెన్‌జీ తరం గుర్తించుకోవాలని సూచించారు. జగన్ ఉంటే ఏపీకి రామని పెట్టుబడిదారులు చెబుతున్న విషయాన్నీ యువత గమనించాలన్నారు. రాజధానిగా అమరాతిని అభివృద్ధి చేయడంతో పాటు అన్ని జిల్లాలను సమాన దృష్టితో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మళ్లీ జగన్ మాయలో పడవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి వల్ల ఎంతోమంది జీవితాలు మారాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాజధాని భూముల ధరలు పెరిగాయన్నారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా రాజధాని నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారని తెలిపారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై చర్చ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. అభివృద్ధిలో ఒకప్పుడు అనంతపురం చివరి స్థానంలో ఉండేదని, కియా పరిశ్రమ వచ్చాక, అనంతపురం 5వ స్థానంలోకి వచ్చిందని గుర్తు చేశారు. రాజధానిపై ప్లేటు ఫిరాయించి: హార్టికల్చర్ ద్వారా సీఎం చంద్రబాబు రాయలసీమను అభివృద్ధి చేశారని, ఉత్తరాంధ్రకు అనేక పరిశ్రమలను తీసుకొచ్చారని మంత్రి లోకేశ్ అన్నారు. ఎన్నికలకు ముందు రాజధానిగా అమరావతి ఉంటుందని జగన్ ప్రకటించారు. అయితే ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన తర్వాత, రాజధానిపై ప్లేటు ఫిరాయించారన్నారు. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారని మంత్రి లోకేశ్ జగన్ పై మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపినందుకు మమ్మల్ని దూషించారని, ఉత్తరాంధ్రకు జగన్ ఏమైనా చేశారా? అని లోకేశ్ ప్రశ్నించారు. జగన్ ఉండేందుకు ఒక ప్యాలెస్ కట్టుకున్నారని, అమరావతి రైతులకు అబద్ధం చెప్పినందుకు జగన్ క్షమాపణ చెప్పాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. "అమరావతి కోసం రైతులు పోరాడారు. ఎప్పుడూ గడప దాటని మహిళలు కూడా పోరాడారు. రాజధానిలో తిరగాలంటే జగన్ పరదాలు కట్టుకుని తిరిగేవారు. తప్పు చేశానని జగన్ కు తెలుసు కాబట్టే, పరదాల చాటున తిరిగారు. ఆందోళన చేస్తున్న మహిళలను జుట్టుపట్టుకొని లాగారు. ఒకే రాష్ట్రం – ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణే మా విధానం. రైతుల పోరాటాలను కవరేజ్ చేస్తున్న ఈటీవీ విలేఖరి పై రేప్ కేసు పెట్టారు. అమరావతి రైతులకు అండగా నిలబడిన మమ్మల్ని దూషించారు. వైఎస్సార్సీపీ హయాంలో చంద్రబాబు పై దాడి చేసేందుకు కూడా యత్నించారు"

# మోదీ- ట్రంప్ ఫోన్‌కాల్ లో మస్క్ ఉన్నారా క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

ఇది యుద్ధ పరిస్థితుల్లో ఇద్దరు దేశాధినేతల మధ్య జరుగుతున్న కీలక సంభాషణలో ఒక ప్రైవేట్ వ్యక్తి పాల్గొనడం అరుదైన విషయం అని పేర్కొంది. అయితే ఈ వార్తలపై అధికారిక ప్రకటనల్లో ఎక్కడా మస్క్ ప్రస్తావన లేకపోవడం సందేహాలకు తావిచ్చింది.

సముద్ర మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చ!

ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం అధికారికంగా స్పందిస్తూ ఆ కథనాలను తోసిపుచ్చింది. మరోవైపు అమెరికా వైట్ హౌస్ కూడా ఈ విషయంపై స్పష్టంగా స్పందించకుండా, మోదీ ట్రంప్ మధ్య సంభాషణ ఉపయోగకరంగా జరిగిందని మాత్రమే పేర్కొంది. మోదీ- ట్రంప్ ఫోన్ కాల్ ప్రధానంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై జరిగింది. ముఖ్యంగా ఇరాన్- ఇజ్రాయెల్- అమెరికా మధ్య జరుగుతున్న ఘర్షణలు, సముద్ర మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి పరిస్థితి పై ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మార్గం ద్వారా భారీగా చమురు, వాయువు రవాణా జరుగుతుంది. ప్రస్తుతం ఇరాన్ నియంత్రణ, యుద్ధ ప్రభావం కారణంగా ఈ మార్గంలో అంతరాయం ఏర్పడటంతో గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం పడుతోంది. ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, హర్మూజ్ జలసంధి ఎప్పటికప్పుడు తెరిచి ఉండాలని, అది భద్రంగా, అందుబాటులో ఉండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత అవసరమని మోదీ తన అభిప్రాయం వెల్లడించారు.

ఇరాన్‌తో చర్చలు జరగవచ్చు!

ఫోన్ కాల్ అనంతరం మోదీ ఎక్స్ లో చేసిన పోస్టులో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. "పశ్చిమాసియా పరిస్థితులపై ట్రంప్‌తో మాట్లాడాను. ఉద్రిక్తతలు తగ్గి శాంతి నెలకొనాలని భారత్ కోరుకుంటోంది. హర్మూజ్ జలసంధి భద్రత ప్రపంచానికి కీలకం" అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా తరఫున ఇరాన్‌తో చర్చలు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ట్రంప్ ప్రత్యేక దౌత్య ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ మాట్లాడుతూ, ఇరాన్ ఈ వారం చర్చలకు ముందుకు రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు ఇరాన్ స్పందిస్తే సమస్యలు పరిష్కారం కావచ్చని తెలిపారు. అయితే మరోవైపు యుద్ధ వాతావరణం మాత్రం ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, గల్ఫ్ ప్రాంతాల్లో క్షిపణి దాడులు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలు, ఇంధన కేంద్రాలు లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఈ పరిణామాల మధ్య మోదీ ట్రంప్ ఫోన్ కాల్ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అందులో మస్క్ పాల్గొన్నారన్న వార్తలపై స్పష్టత రావడంతో ఊహాగానాలకు చెక్ పడింది. మొత్తానికి, పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన భద్రత, అంతర్జాతీయ శాంతి వంటి కీలక అంశాలపై భారత్ తన స్థానం స్పష్టంగా వెల్లడించగా, మస్క్ వివాదం మాత్రం తాత్కాలిక చర్చగా ముగిసింది.

## తమిళనాడులో డీఎంకే 164, కాంగ్రెస్ 28 స్థానాల్లో పోటీ- ఇతర మిత్రపక్షాలకు 42 సీట్లు కేటాయింపు

మొదటి పేజి తరువాయి

28 స్థానాలు కేటాయించారు. ప్రేమలత విజయకాంత్ నేతృత్వంలోని దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే) పార్టీకి 10 స్థానాలు దక్కాయి. విదుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే) పార్టీకి 8 స్థానాలు కేటాయించగా, సీపీఎం, సీపీఐ చెరో 5 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. వైకో నేతృత్వంలోని మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) పార్టీకి మధురై సౌత్ సహా 4 స్థానాలు ఇచ్చారు. కాగా మిత్రపక్షాలకు చెందిన మరో 11 మంది అభ్యర్థులకు కూడా సీట్లు కేటాయించారు. అయితే వీరు డీఎంకే పార్టీ గుర్తు అయిన 'ఉదయించే సూర్యుడు'పైనే బరిలోకి దిగుతున్నారు.

ఎందుకింత జాప్యం?

తమ కూటమి సీట్ల పంపకం విషయంలో జరిగిన జాప్యంపై డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ స్పందించారు. కూటమిలోని పార్టీలు, తమ మధ్య సమతుల్యమైన ఒప్పందం కుదుర్చుకోవడానికి చాలా ఓపికగా చర్చలు జరిపాయని, అందుకే ఇంత సమయం పట్టిందని అన్నారు.

కీలక స్థానాలు ఇవే!

ఈసారి మంత్రి సెంథిల్ బాలాజీ- కరూర్ స్థానం నుంచి మారి, కోయంబత్తూరు సౌత్ నుంచి బరిలోకి దిగుతున్నారు. కాగా, సిట్టింగ్ మంత్రులైన కేఎన్ నెహ్రూ- మధురై సెంట్రల్ , తిరుచి వెస్ట్ నుంచి మళ్లీ ఎన్నిక కావాలని కోరుకుంటున్నారు. మంత్రి టీఆర్ బీ రాజా మళ్లీ మన్నార్గుడి నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు. మరో మంత్రి ఐ పెరియస్వామికి దిండిగల్ , మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యమొళికి తిరువేరుంబూర్ , గీతా జీవన్ కు తూత్తుకిడి సీట్లు కేటాయించారు. ఇవన్నీ డీఎంకేకు అత్యంత కీలకమైన స్థానాలు. ఇక వేలచ్చేరి, ఈరోడ్ నియోజకవర్గాలు మళ్లీ కాంగ్రెస్ కోటాలోకే వచ్చాయి. ఇక ఉదగమండలంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రత్యక్ష పోటీ జరగనుంది. కాంగ్రెస్ కు చెందిన ఇతర ముఖ్యమైన స్థానాల్లో శ్రీపెరుంబుదూర్ , కడలూరు, మైలాడుతురై, శివకాశి, కృష్ణగిరి, కన్యాకుమారి ప్రాంతంలోని విళవన్ కోడ్ , కిళ్లియూర్ నియోజక వర్గాలున్నాయి. మరోవైపు వామపక్ష పార్టీలు వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన స్థానాలను దక్కించుకున్నాయి. సీపీఐ తిరుప్పూర్ (నార్త్ ), భవానినగర్ , సీపీఐ(ఎం) పళని, తిరువొత్తియూర్ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనుంది. వీసీకేకు కట్టుమన్నార్కోవిల్ , తిరుపోరూర్ లాంటి నియోజకవర్గాలను కేటాయించారు. ఎండీఎంకే మధురై సౌత్, సిర్కాళితో సహా పలు కీలక స్థానాలు దక్కాయి.

మ్యానిఫెస్టో ఎప్పుడు?

ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ఈ కూటమి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మార్చి 29న తన మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

డీఎంకేలో 60 కొత్త ముఖాలు

డీఎంకే ఈసారి చాలా జాగ్రత్తగా తన అభ్యర్థులను ఎంచుకుంది. ఇందులో అనుభవజ్ఞులతోపాటు, 60 మంది కొత్త వారికి అవకాశాలను కల్పించింది. డీఎంకే అభ్యర్థుల్లో 29 మంది న్యాయవాదులు, 17 మంది ఇంజినీర్లు, 15 మంది డాక్టర్లు, 7 పీహెచ్ డీ పట్టభద్రులు ఉన్నారు. అంతేకాదు 18 సీట్లను మహిళా అభ్యర్థులకు కేటాయించారు.

గట్టిపోటీ తప్పదా?

ఇప్పటికే ఏఐఏడీఎంకే, ఎన్ డీఏ కూటమి కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. మరోవైపు విజయ్ నేతృత్వంలోని టీవీకే కూడా మొదటిసారి బరిలోకి దిగుతోంది. అయినప్పటికీ ప్రధాన పోటీ డీఎంకే, ఏఐఏడీఎంకేకు మాత్రమే ఉండొచ్చని అంచనాలున్నాయి. మరి తమిళ ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

# తొలి ముద్ద' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. "బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుంది. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి" అని సీఎం అన్నారు.

# సంపాదకీయం

## ఎన్టీఆర్ ఎప్పుడూ ఏ విషయాన్నీ తేలిగ్గా చెప్పరు.

నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న స్థాపించిన రాజకీయ పార్టీ 'తెలుగుదేశం' 9 నెలల స్వల్ప వ్యవధిలోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించింది. పార్టీ ఆవిర్భావానికి దారితీసిన నేపథ్యం ఎంతో ఆసక్తికరమైనది. 1981 అక్టోబర్ నెలలో ఊటీలో ఒకరోజు ఎన్టీఆర్ నటిస్తున్న 'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. విరామంలో ఆయన కుర్చీలో కళ్లు మూసుకొని కూర్చొని తర్వాత సన్నివేశంలోని డైలాగులు గుర్తు తెచ్చుకుంటున్నారు. అక్కడకు వచ్చిన కొందరు పాత్రికేయులు ఆయన చుట్టూ చేరారు. హఠాత్తుగా ఓ పాత్రికేయుడు 'సార్! మరో ఆరు నెలల్లో మీకు 60 సంవత్సరాలు పూర్తవుతున్నాయి షష్టిపూర్తి చేసుకోబోతున్నారు కదా! ఆ శుభ సందర్భంలో ఏదైనా నిర్ణయం తీసుకోబోతున్నారా?' అని ప్రశ్నించాడు. ఎన్టీఆర్ ఒక క్షణం ఆలోచించి "ఎక్కడో నిమ్మకూరులో పుట్టి పెరిగిన నన్ను తెలుగు ప్రజలు సినిమా నటుడిగా, తమ 'అన్న'గా గత 30 సంవత్సరాలుగా నాపై అంతులేని అభిమానాన్ని, ప్రేమను చూపుతున్నారు. నా చిత్రాల్ని అభిమానంతో ఆదరిస్తూ నాకెంతో పేరు ప్రఖ్యాతులనిచ్చారు. ఇప్పుడా రుణాన్నంతటినీ ఏదో ఒక రూపంలో తీర్చవలసిన బాధ్యత నాపై ఉంది. వచ్చే నా పుట్టినరోజు నాటి నుంచి సంఘసేవకు అంకితమవుతాను" అని చెప్పారు. ఎన్టీఆర్ ఎప్పుడూ ఏ విషయాన్నీ తేలిగ్గా చెప్పరు. చెప్పారంటే అది చేసి తీరుతారు. ఆ నిజం తెలిసిన పత్రికలు ఆయన ప్రకటనను ప్రముఖంగా ప్రచురించాయి. ఆ వార్త రాష్ట్రమంతటా కార్చిచ్చులా వ్యాపించింది. ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీ స్థాపించనున్నారన్న వార్త వెలువడే నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో ఎగిసిన గ్రూపు తగాదాలు భయంకరంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి చెన్నారెడ్డి జాతీయ కాంగ్రెస్ పార్టీకి నిధులు సమకూర్చే నెపంతో విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సొంత పార్టీ నేతలే ఆయనపై విమర్శలు చేశారు. ఆ సమయంలోనే హైదరాబాద్ పాతనగరంలో ఓ మహిళపై పోలీస్ స్టేషన్‌లో జరిగిన అత్యాచార ఘటన దరిమిలా శాంతిభద్రతలు అదుపుతప్పి మత ఘర్షణలు రేగాయి. అసమ్మతి కారణంగా మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి గద్దె నుంచి దిగాల్సి వచ్చింది. ఆ పదవికి టంగుటూరి అంజయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. 61 మందితో అంజయ్య భారీ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎమ్మెల్యేకు కార్పొరేషన్ పదవో, మరో పదవో ఇచ్చి తనకు అసమ్మతి లేకుండా చేసుకోవడానికి అంజయ్య తంటాలు పడ్డారు. ఇందిరాగాంధీ అండదండలున్నా అసమ్మతి కారణంగా అంజయ్య కూడా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అంజయ్య స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న భవనం వెంకట్రామ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పాలనలో అవినీతి కొత్త పోకడలు పోయింది. అసెంబ్లీ కాలపరిమితి మరో రెండు, మూడు నెలల్లో ముగుస్తుందనగా భవనంను తప్పించి కోట్ల విజయభాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. ఆ విధంగా ఐదేళ్ల వ్యవధిలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా, సీల్డు కవర్లో తాము నిర్ణయం చేసినవారే ముఖ్యమంత్రులయ్యే ఓ దుష్ట సంప్రదాయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం నెలకొల్పింది. ఆ పాలన ప్రజల్లో తీవ్రమైన ఏవగింపు కలిగించింది. నిజానికి రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ, పరిపాలనా రంగాల్లో వైఫల్యం, నెలకొన్న సంక్షోభాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి. అటువంటి నేపథ్యంలోనే ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. రాజకీయాల్లోకి రావాలని గట్టి నిర్ణయం తీసుకున్న ఎన్టీఆర్.. ముందుగా తాను ఒప్పుకున్న చిత్రాల షూటింగ్ పూర్తి చేసుకొన్నారు. మార్చి 29న మధ్యాహ్నం 2.30 గంటలకు నూతన పార్టీని ప్రారంభించడానికి ముహూర్తం నిర్ణయించారు. హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో చిన్న హాలులో కొద్దిమంది సమక్షంలో పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించాలనుకున్నారు. కానీ, ఆ ఉదయం నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి ఎన్టీఆర్ అభిమానులు అక్కడికి చేరుకున్నారు. వారంతా దిక్కులు పిక్కటిల్లేటట్లు 'ఎన్టీఆర్ జిందాబాద్' అంటూ నినాదాలు చేస్తున్నారు. దాంతో, పార్టీ ప్రకటన వేదికను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఆవరణలోని పచ్చిక మైదానంలోకి మార్చారు. అభిమానులను ఉద్దేశించి ఎన్టీఆర్ "నా ప్రియమైన సోదర సోదరీమణులారా! కొన్ని నెలలుగా నేను రాజకీయాలలో ప్రవేశించడంపై తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ప్రజల స్పందన ఏ విధంగా ఉంటుందోనని అనుకున్నాను. కానీ ఎటువంటి ఆహ్వానం లేకుండానే మీరందరూ ఇక్కడకు రావడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. మీ అభిమానానికి పులకించిపోతున్నాను. ఈ క్షణాన నేను రాజకీయాలలో అడుగుపెడుతున్నాను" అంటూ క్లుప్తంగా ఆయన తన ఉపన్యాసాన్ని ముగించగానే ఆ ప్రాంతమంతా చప్పట్లు, ఈలలు, నినాదాలతో మారుమోగిపోయింది. 'మీ పార్టీ పేరేంటి సార్?' ఎవరో విలేఖరి గుంపులోంచి ప్రశ్నించాడు. ఒక్క క్షణం అంతటా నిశ్శబ్దం. ఎన్టీఆర్ తన లాల్చీ జేబులోంచి ఓ కాగితం బయటకు తీశారు. దానిపై కొన్ని అక్షరాలు రాసి ఉన్నాయి. 'తెలుగుదేశం' అని ఎన్టీఆర్ అంటూ "నేను తెలుగువాణ్ణి. ఈ రోజు నుంచి నా జీవితాన్ని తెలుగు ప్రజల కోసం, ఈ రాష్ట్రం కోసం అంకితం చేస్తున్నాను. మహోన్నతమైన తెలుగు సంస్కృతిని, తెలుగుభాష ఔన్నత్యాన్ని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతాను. అందుకే మా పార్టీ పేరును 'తెలుగుదేశం'గా నామకరణం చేస్తున్నాను" అని ప్రకటించారు. ఆ విధంగా 44 సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. పార్టీ ఏర్పాటు తర్వాత ఎన్టీఆర్ చైతన్య రథంపై ప్రజల వద్దకు వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా 36వేల

## చమురు మంటలు.. సామాన్యులే సమిధలు!




ఆకస్మికంగా తలెత్తిన చమురు సంక్షోభంతో భారత్ అల్లాడుతోంది. పెట్రోలు బంకుల్లో కొరత కనిపిస్తోంది. భయాందోళనలతో ప్రజలు ఎక్కువెక్కువగా కొనుగోలు చేస్తుండటంతో నిల్వలు ఖాళీ అవుతున్నాయి. కొన్ని పంపుల దగ్గర భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. క్యాబ్‌లు, ఆటోవాలాలు ట్రిప్పులు రద్దు చేసుకుంటున్నారు. వంటగ్యాస్ సమస్యతో హోటళ్లు మూతపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం మన దేశంలో సామాన్య జనజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన అందుబాటుకు సంబంధించి దేశవ్యాప్తంగా నెలకొన్న గందరగోళానికి మూలాలు ఫిబ్రవరి చివర్లోనే పడ్డాయి. ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీలో భాగంగా అమెరికా-ఇజ్రాయెల్‌లు ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో సుప్రీం నేత ఖమేనీ మరణించడంతో ప్రతీకార జ్వాలలు ఎగసిపడ్డాయి. కీలకమైన చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో సౌదీ అరామ్‌కోకు చెందిన రస్‌తానూరా రిఫైనరీ తీవ్రంగా దెబ్బతినడంతో అది పూర్తిగా మూతపడింది. యూఏఈకి చెందిన అద్నాక్ ఫుజైరా కార్యకలాపాలను 30శాతందాకా తగ్గించింది. ఖతార్‌లోని రస్‌లఫాన్ ఎల్‌ఎన్‌జీ కేంద్రం ఉత్పత్తిని నిలిపివేసింది. ఇరాక్ ఎగుమతులు రోజుకు 15లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. భద్రతాపరమైన భయాలతో కువైట్ చమురు క్షేత్రాలు నిలిచిపోయాయి. మునుపెన్నడూ లేనిరీతిలో ముప్పు ఎదుర్కొంటున్న గల్ఫ్ ఉత్పత్తిదారులు ప్లాంట్లను మూసివేయడమో, ఉత్పత్తిని బాగా తగ్గించడమో చేస్తున్నారు.

### ఇండియాకు ఇక్కట్లు

అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి పెంచేందుకు హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఒక భౌగోళిక ఆయుధంగా మార్చి ప్రయోగించింది. ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచ చమురులో 20శాతం చమురుతోపాటు, భారీస్థాయిలో ద్రవీకృత సహజ వాయువు రవాణా జరుగుతుంది. అయితే, ఈ మార్గంలో రోజుకు డజన్లకొద్దీ సాగే ట్యాంకర్ల రాకపోకలు దాదాపు సున్నాకు పడిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి. 150కి పైగా నౌకలు తీరానికి దూరంగా లంగరు వేసి ఉన్నాయి. ఈ మొత్తం పరిణామంలో అసలైన సమస్య బీమా కంపెనీల నుంచే ఎదురైంది. 90శాతం సముద్రయాన నౌకలకు ప్రాతినిధ్యం వహించే ఏడు ప్రధాన సంస్థలు యుద్ధ ప్రమాద రద్దు నోటీసులను జారీ చేశాయి. బీమా లేకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ఓడరేవులు ఓడలను నిలపడానికి నిరాకరిస్తాయి. యజమానులు సరకులను పక్కనపెడతారు. ఒకవేళ ఆఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్‌హోప్ చుట్టూ తిరిగివచ్చేలా మార్గాన్ని మళ్లిస్తే, పదిహేను రోజులదాకా అదనపు సమయం పడుతుంది. ఇంధన ఖర్చులు అదనంగా లక్షల డాలర్లవుతాయి. దీనంతటి వల్ల యుద్ధ ప్రమాద ప్రీమియంలు రెట్టింపు లేదా మూడురెట్లు పెరిగిపోయాయి. కనిపించని దిగ్బంధనం మందుపాతరలు, యుద్ధనౌకలకన్నా ప్రమాదకరంగా తయారైంది. ఈ పరిణామాలకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రధాన ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాలతో ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న ఇండియా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. తన అవసరాలలో 85శాతందాకా విదేశీ ముడిచమురుపైనే ఆధారపడి ఉంది. ఇందులో 35నుంచి 50శాతం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి హర్మూజ్ మార్గం ద్వారా వస్తుంది. వంటకు వాడే ఎల్‌పీజీలో సుమారు 80శాతం, ఎల్‌ఎన్‌జీలో సగం ఇదే మార్గంగుండా వస్తాయి. వ్యూహాత్మక నిల్వలు రెండు నెలల వరకు ఆసరా ఇస్తాయి. నిల్వ, రవాణాలో సుమారు 10కోట్ల బ్యారెళ్లు ఉన్నాయి. కానీ, భయాందోళనలు ప్రణాళికలన్నింటినీ దెబ్బతీశాయి. ఇండియన్ ఆయిల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు రష్యా, అమెరికా, బ్రెజిల్, పశ్చిమాఫ్రికా సరఫరాల కోసం పోటీపడుతున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపులు ఇవ్వడంతో రష్యా చమురు రాయితీపై వస్తోంది. ఇది హర్మూజ్‌యేతర మార్గాల ద్వారా వస్తూ 40శాతం డిమాండ్‌ను తీరుస్తోంది. అయినప్పటికీ గల్ఫ్ ముడిచమురు, ఎల్‌ఎన్‌జీకి పూర్తి ప్రత్యామ్నాయంగా మారలేకపోతోంది. క్షేత్రస్థాయిలో ఈ సంక్షోభం వేగంగా విజృంభిస్తోంది. ప్రజలు భయాందోళనలతో చమురును కొనుగోలు చేస్తుండటంతో బంకులు మూతపడుతున్నాయి. కుటుంబాలు ప్రత్యామ్నాయాల కోసం వెదుకుతున్నాయి. గ్రామాలకు మార్కెట్లతో సంబంధాలు తెగిపోతున్నాయి. పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయి. నమ్మకమైన రవాణా లేకపోవడంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పాఠశాలలు ఆలస్యమవుతున్నాయి. కార్యాలయాలు ఖాళీ అవుతున్నాయి. ఆసుపత్రులు జనరేటర్ల కోసం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో వాడుతున్నాయి. కొన్నిరకాల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. రవాణా, ఆహారం, విద్యుత్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా అన్ని వైపుల నుంచి తాకిడి పెరుగుతోంది. భారత ఎగుమతుల్లో 17శాతాన్ని గల్ఫ్ దేశాలు స్వీకరిస్తున్నాయి. విస్తృత మార్కెట్లకు ముఖద్వారాలుగా ఉన్న యూఏఈ, సౌదీ హబ్‌లు ఇప్పుడు సరఫరాలో జాప్యాలు, ఆకాశాన్ని అంటుతున్న రవాణా ఛార్జీలు, యుద్ధ రుసుములతో సతమతమవుతున్నాయి. దాంతో చిన్న, మధ్యతరహా ఎగుమతిదారుల లాభాలు కనుమరుగవుతున్నాయి.

భౌగోళిక రాజకీయాలకు మూల్యం

పరిస్థితులు గందరగోళంగా మారడంతో ప్రభుత్వం పలు చర్యలతో రంగంలోకి దిగింది. చమురు కొరత లేదంటున్న అధికారులు ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నారు. దౌత్యం ద్వారా త్వరలోనే హర్మూజ్ జలసంధి సమస్య పరిష్కారమయ్యేలా కనపడుతోంది. ముడిచమురు ధర 85-90 డాలర్ల దగ్గర స్థిరంగా ఉంటుందనే ఆశావాదం వ్యక్తమవుతోంది. భారత్ తన దగ్గరి నిల్వలతోపాటు, రష్యా సరఫరాలతో గండంలోంచి బయటపడుతుందని అంచనా వేస్తున్నారు. జీపీఎస్ జామ్‌లు, ఇరాన్ అణు బెదిరింపుల వల్ల బీమా స్తంభనలు దీర్ఘకాలం కొనసాగుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల కొరతపై వార్తలు రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఈ గందరగోళం భారతదేశ ఇంధన బలహీనతను బయటపెడుతోంది. ఇండియాతో పాటు మరికొన్ని దేశాల్లోనూ పరిస్థితులు ఇలాగే అగమ్యగోచరంగా ఉన్నాయి. సుదూర తీరాల్లోని భౌగోళిక రాజకీయాలకు సామాన్యులు మూల్యం చెల్లించాల్సిన అగత్యం నెలకొంది. యుద్ధవిరమణ దిశగా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేస్తేనే ఈ సంక్షోభం సమసిపోతుంది.

## చట్టబద్ధ మావోయిస్టులారా.. ఏకం కండి!



2025 అక్టోబర్ 15న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ తన 60 మంది సహచరులతో కలిసి గడ్చిరోలిలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఎదుట ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. రెండు రోజుల తర్వాత అక్టోబర్ 17న జగ్దల్‌పూర్‌లో తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న మరో 200 మందికి పైగా వివిధ స్థాయిల కేడర్లతో అదే పని చేశారు. అప్పటి నుంచీ (అంతకుముందు కూడా ఇలాంటి లొంగుబాట్లు జరిగినా అవి జరిగిన రూపం, సారం వేరు) మావోయిస్టుల ఆయుధాల విసర్జన, పోలీసుల సమక్షంలో లొంగుబాట్ల పర్వం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఎంఎంసీ(మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్), ఏఓబీ(ఆంధ్రా-ఒడిషా సరిహద్దు), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిసి సుమారు మూడు వేల మంది మావోయిస్టులు చట్టబద్ధ జీవనంలోకి వచ్చారు. ఇందులో పొలిట్‌బ్యూరో సభ్యులు ఇద్దరు, కేంద్రకమిటీ సభ్యులు ఐదుగురు ఉన్నారు. 20కి మించిన సంఖ్యలో రాష్ట్ర కమిటీల సభ్యులు, సుమారు వంద మంది వరకూ జిల్లా, డివిజన్ కమిటీల సభ్యులు, పలువురు కంపెనీ, ప్లాటూన్ కమాండర్లు, సీవైపీసీ, పీపీసిల సభ్యులు, ఏరియా కమిటీల కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు. ఈ మూడు వేల మందిలో 50శాతం కంటే ఎక్కువ మంది మహిళలు, 98శాతం వరకూ ఆదివాసులు ఉండడం గమనార్హం.

సాయుధ పోరాట పంథాకు కాలం చెల్లింది..

తన లొంగుబాటుకు ముందే విడుదల చేసిన పలు ప్రకటనల్లో మల్లోజుల అలియాస్ సోనూ కొన్ని విషయాలను చాలా స్పష్టంగా చెప్పారు. దేశంలో మారిన సామాజిక-ఆర్థిక సంబంధాల మూలంగా ప్రస్తుతం దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథాకు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డారు. మావోయిస్టు పార్టీ ఉన్నత నాయకత్వం స్థల, కాల పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించలేకపోయిందని, పిడివాద వైఖరి అవలంభించిందని చెప్పారు. తమ తప్పుడు ఆచరణ మూలంగా ప్రజలకు ప్రత్యేకించి విప్లవ శ్రేణులకు తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. అందుకు తాను పశ్చాత్తాప పడుతున్నానని, బేషరతుగా క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. ఇకముందు జరిగే తప్పులకు తాను బాధ్యత వహించదల్చుకోలేదని, తక్షణం పొలిట్‌బ్యూరో పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఆ తర్వాత నెల రోజులకు జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మల్లోజుల బాటలో ఆ తర్వాత వచ్చిన అందరు నేతలు, కేడర్ కూడా ఆయన చెప్పిన విషయాలనే వేర్వేరు రూపాల్లో, వ్యక్తీకరణల్లో తిరిగి చెప్పారు.

తెలంగాణ లొంగుబాట్లది మరో దారి..?

కాగా, ఇతర రాష్ట్రాల్లో జరిగిన దానికి భిన్నంగా తెలంగాణలో లొంగుబాట్లు జరిగాయి. మొదటగా వచ్చిన కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క అనారోగ్య సమస్యలతో బయటకు వచ్చానని చెప్పింది. ఆ తర్వాత వచ్చిన మరో సీసీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, బండి ప్రకాశ్ తాము వయసు తెచ్చిన అనారోగ్య సమస్యలతోనే లొంగిపోతున్నట్లు చెప్పారు. పరిస్థితులు మారాయని, ఇకముందు చట్టబద్ధంగా ప్రజల కోసం పనిచేస్తామన్నారు. ఆ తర్వాత వచ్చిన తెలంగాణలో లొంగిపోయిన పలువురు నేతలు ఇదే విషయాన్ని చెప్పారు. అయితే, గత నెలలో జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మాత్రం భిన్న వైఖరి అవలంభించారు. తాము లొంగిపోలేదని, అరెస్టయ్యామని, విధిలేని పరిస్థితుల్లో అజ్ఞాత జీవితానికి స్వస్తి చెప్పాల్సివచ్చిందని ఇంటర్వ్యూల్లో వివరించారు. తాము ఇకపై చట్టబద్ధంగా పోరాడతామని వివరించారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధం ఎత్తివేసి, చట్టబద్ధ పార్టీగా గుర్తించాలని, తాము పీఎల్జీఏను రద్దు చేస్తామని కోరారు. అది కేంద్రం పరిధిలోని విషయం కనుక తాను హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడుతానని సీఎం హామీ ఇచ్చారు.

రెండు వర్గాలుగా చీలిక!

సోనూ-ఆశన్న వర్గాలు లొంగిపోయిన తర్వాత మావోయిస్టు పార్టీ తరఫున అభయ్ పేరుతో ఒక ప్రకటన వచ్చింది. ఈ జనవరిలో 40 పేజీల రాతపూర్వక ఇంటర్వ్యూ సైతం వెలువడింది. వీటిలో అభయ్‌గా చెప్పుకుంటున్న నేత(బహుశా దేవ్‌జీ) సోనూ-ఆశన్నలను పిరికిపందలుగా, ద్రోహులుగా, కోవర్టులుగా ప్రకటించారు. పార్టీకి చెప్పకుండా ఆయుధాలతో సహా లొంగిపోవడం విప్లవ ప్రతీఘాతుకత్వమేనని స్పష్టం చేశారు. దీనిపై సోనూ-ఆశన్న వర్గాలు స్పందించలేదు. అయితే, వివిధ చానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సోనూ, ఇటీవల తెలంగాణకు వచ్చిన సందర్భంలో ఆశన్న కొన్ని విషయాలను స్పష్టం చేశారు. తాము ఈ వివాదాల్లోకి పోదలచుకోలేదని, భవిష్యత్తులో తమ ఆచరణే సమాధానం చెబుతుందని క్లారిటీ ఇచ్చారు.

### విప్లవ శ్రేణులు ఏమనుకుంటున్నాయి?

ఈ లొంగుబాట్ల పర్వంపై ప్రస్తుతం తెలంగాణ సమాజం విస్మయం వ్యక్తం చేస్తున్నది. ఎంతో ఉన్నతంగా ఉన్న పార్టీ కేవలం ఏడాది కాలంలోనే ఇలా ఓటమి చెంది, అంతరించిపోతుండడం పట్ల చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయుధ పోరాట పంథా పనిచేయదని ఇప్పుడు వచ్చి చెబితే.. మరి ఇన్నేళ్ల బలిదానాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. సిద్ధాంత రాజకీయం తెలిసిన వాళ్లు, మేధావులు మాత్రం ఇది తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిన పరిణామంగా గుర్తించి పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. కొందరు మాత్రం దేవ్‌జీ-రాజిరెడ్డి బయటకు వచ్చిన తీరును సమర్థిస్తుంటే, చాలామంది రెండు వర్గాలనూ ఒకేగాటన కడుతున్నారు. వాళ్లు అక్కడ ఆయుధాలిచ్చినా, రాజ్యాంగం చేబూనినా.. వీళ్లు ఇక్కడ ఆయుధాలు తేకున్నా, అరెస్టయినట్టు చెబుతున్నా, రాజ్యాంగ ప్రతి చేబూనక పోయినా ఇద్దరూ కలవడమే మంచిదంటున్నారు. "సోనూ-ఆశన్నలు ఆయుధాలతో లొంగిపోయినా తాము భవిష్యత్తులో కొత్త వేదిక కోసం ఆలోచిస్తున్నామని, ప్రజల కోసమే పనిచేస్తామని అంటున్నారు. దేవ్‌జీ-రాజిరెడ్డిలు ఆయుధాలతో లొంగిపోకున్నా, ఆ తర్వాత వారి దారిలో వచ్చిన కేడర్లు భారీగా ఆయుధాలు సమర్పించారు కనుకనూ, అరెస్టని చెబుతున్నా, లొంగుబాటు వేదికపై రివార్డు చెక్కులు తీసుకున్నారు కనకనూ" ఇద్దరినీ ఒకటిగానే చూడాలంటున్నారు.

### ఏకమైతే బలమైన చట్టబద్ధ పార్టీ!

కాగా, ఫాల్స్ ప్రిస్టేజీకి లోనుగాకుండా రెండు వర్గాలు కనుక ఏకమైతే దేశంలోనే బలమైన చట్టబద్ధ మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేయవచ్చునని విప్లవాభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీల లోపల అంతర్గత పోరాటం జరిగినప్పుడు ఎలాగైతే ప్రజల మేలు కోసం ఆలోచించి నిర్ణయం తీసుకున్నారో, ఇప్పుడు కూడా ప్రజల ప్రయోజనాల ప్రాతిపదికన ఏకం కావాలని పిలుపునిస్తున్నారు. ఇరువర్గాలూ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం మానేయాలంటున్నారు. ముఖ్యంగా సోనూ వర్గాన్ని ఉద్దేశించి దేవ్‌జీ వర్గం ఉపయోగిస్తున్న కోవర్ట్ పదాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. గత రెండేళ్లలో జనజీవన స్రవంతిలోకి వచ్చిన మూడు వేలకు పైగా మావోయిస్టులు పూనుకుంటే ఐక్య పార్టీ సాధ్యమేనంటున్నారు. గత ఐదు దశాబ్దాలుగా దేశంలో ప్రత్యేకించి ఉద్యమ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ సహా వివిధ మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల్లో పనిచేస్తున్న, పనిచేసి వివిధ సందర్భాల్లో బయటకు వచ్చిన వాళ్లను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య లక్ష దాటవచ్చని అంచనా వేస్తున్నారు. అప్పుడు దేశంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఒక బలమైన శక్తి ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. పలు దక్షిణ అమెరికా దేశాల్లో ఇలాంటి చొరవ చేసిన కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చిన సందర్భాలను ఉటంకిస్తున్నారు.

## మతం మారినా మారని వివక్ష

గౌరవ సుప్రీంకోర్టు దళిత క్రిస్టియన్ల విషయంలో ఇచ్చిన తీర్పు చాలా దురదృష్టకరం. ఈ తీర్పు రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి గొప్ప విలువలకు తూట్లు పొడిచింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉండడమే కాకుండా, కోట్లాది మంది దళిత క్రిస్టియన్ల జీవితాలను ఈ తీర్పు ప్రమాదంలో పడేయబోతున్నది. భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అప్పీల్‌కు వెళ్లి ఈ రాజ్యాంగ వ్యతిరేక తీర్పును రద్దు చేయించాలి. 1985 జూలై 17న జరిగిన కారంచేడు హత్యాకాండ దేశంలోనే సంచలనం సృష్టించింది. దళిత (మాదిగ) వర్గానికి చెందిన తాగునీటి చెరువులో ఆధిపత్య (కమ్మ) సామాజికవర్గానికి చెందిన యువకులు పశువులకు స్నానం చేయించారు. ఇదేంటని ప్రశ్నించినందుకు, మాపైనే ఎదురుతిరిగి మాట్లాడుతారా అనే అహంకారంతో దాడికి పాల్పడ్డారు. ఆరుగురు మాదిగలను హత్య చేశారు. ముగ్గురు మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ప్రత్యక్ష సాక్షిని విషాహారం పెట్టి చంపారు. ఈ హత్యాకాండనే దేశంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం రావడానికి పునాది అయింది. అయితే ఈ మారణకాండలో మృతులు తెల్లా మోషే, తెల్లా ముత్తయ్య, తెల్లా యెహోషువా, సాక్షి దుడ్డు అలీసమ్మ క్రైస్తవ మతాన్నే ఆచరించారు. వారిని చంపినందుకే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టం ప్రకారమే సుప్రీంకోర్టు నుంచి కింది కోర్టుల వరకు తీర్పులు వెలువరించాయి. 1991 ఆగస్టు 6న చుండూరులో జరిగిన హత్యాకాండలో 8 మంది దళిత (మాల) యువకులు మరణించారు. అందులో జాలాది ఇమ్మాన్యుయేల్, జాలాది ఇసాకు, సంకురు సామ్సన్ కూడా క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నవారే. ఈ కేసులో 2007లో చుండూరులోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ప్రత్యేక కోర్టు 21 మందికి జీవిత ఖైదు, 35 మందికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. అనంతరం 2014లో హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును కొట్టివేస్తే, ఇప్పటికీ ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లోనే ఉన్నది. ఈ కేసు సుప్రీం కోర్టులో ఇంకా ఎందుకు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నది అని ఊహించడం అంత కష్టమేమీ కాదు. సుప్రీంకోర్టు అదే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'చింతాడ ఆనంద్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' కేసులో గతంలో ఇచ్చిన తీర్పును, చట్టాలను ఎలా విస్మరించింది? ఆనాడు బాధితులు అనుసరిస్తున్న మతంతో సంబంధం లేకుండా, కేవలం కులం ఆధారంగానే కేసులు నమోదు చేసి తీర్పులు ఇచ్చి, ఇప్పుడు మతానికి రిజర్వేషన్లు, రక్షణ చట్టాలను ఎలా అంటకడుతారు?

కులం వేరు-మతం వేరు

భారతీయ సమాజంలో కుల వివక్ష ఒక లోతైన సామాజిక వ్యాధి. ఇది కేవలం మతపరమైన నమ్మకం కాదు, పుట్టుకతో వచ్చే ఒక సామాజిక ముద్ర. క్రైస్తవ మతంలోకి మారినంత మాత్రాన ఒక వ్యక్తి ఎదుర్కొనే కులపరమైన వేధింపులు, సామాజిక వెలివేతలు మటుమాయం అవుతాయా? అస్పృశ్యత అనే కళంకం బాప్టిజం నీటితో కడిగివేసినట్టు అవుతుందా?

శాసన చరిత్ర సామాజిక సత్యం

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వుల్లోని క్లాజ్ 3 చరిత్రను పరిశీలించడం చాలా అవసరం. 1950లో ఈ ఉత్తర్వును మొదటిసారి అమలు చేసినప్పుడు, క్లాజ్ 3 ప్రకారం కేవలం హిందూ మతాన్ని అనుసరించే వారికి మాత్రమే ఎస్సీ హోదా పరిమితమై ఉండేది. ఆ తర్వాత 1956లో దీనిని సవరించి సిక్కు మతస్థులను చేర్చారు. 1990లో మరోసారి సవరణ చేస్తూ బౌద్ధ మతస్థులకు కూడా ఈ హోదాను వర్తింపజేశారు. అయితే, ఇన్ని దశాబ్దాల్లో ఎన్ని సవరణలు జరిగినప్పటికీ క్రైస్తవ మతాన్ని మాత్రం ఈ ఉత్తర్వుల్లో చేర్చకపోవడం గమనార్హం. ఇదే ప్రాతిపదికన, క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వర్తించదని కోర్టు స్పష్టంచేసింది. కానీ ఇక్కడ ఒక సామాజిక సత్యం దాగి ఉన్నది. కులం మతపరమైన గుర్తింపు కాదు, అది ఒక వారసత్వ సామాజిక నిర్మాణం. ఒక వ్యక్తి తన ఆత్మగౌరవం కోసం మతం మారవచ్చు, కానీ సమాజం అతడిని చూసే కోణం మారడం లేదు. ఈ కేసులో నిందితులు బాధితుడిని కేవలం క్రైస్తవుడిగా చూసి దాడి చేయలేదు; వారు అతడిని ఒక నిర్దిష్ట కులానికి (మాదిగ) చెందిన వ్యక్తిగా గుర్తించి, కులపరమైన దూషణలతో దాడికి పాల్పడ్డారు. అంటే, హింసకు ప్రేరణ కుల వివక్షే అయినప్పుడు,

# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం



హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది.

# పెళ్లి తర్వాత కూడా తగ్గని జోరు...

## పాన్ ఇండియా రాణిగా రష్మిక హవా!



। నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి.
అంతేకాదు, అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కూడా రష్మిక పేరు వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయితే ఐకాన్ స్టార్‌తో ఆమెకు హ్యాట్రిక్ మూవీ అవుతుంది. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా రష్మిక జోరు తగ్గడం లేదు.
యానిమల్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న ఆమె, దాని సీక్వెల్ యానిమల్ పార్క్‌లో మరోసారి గీతాంజలి పాత్రలో కనిపించనుంది. ఇందులో రణ్‌బీర్ కపూర్‌తో కలిసి ఆమె నటనపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక 'కాక్టెయిల్ 2' వంటి ప్రాజెక్టులతో హిందీ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది.

గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, రష్మిక ఇప్పుడు విభిన్న కథలతో ముందుకు వస్తోంది. 'మైసా', 'రణబాలి' వంటి చిత్రాల్లో కొత్త తరహా పాత్రలతో తన నటనలోని మరో కోణాన్ని చూపించనుంది. ప్రత్యేకంగా 'రణబాలి'లో విజయ్ దేవరకొండతో కలిసి నటించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. పెళ్లి తర్వాత కెరీర్ స్లో అవుతుందని అనుకునే ట్రెండ్‌ను రష్మిక పూర్తిగా మార్చేస్తోంది. భారీ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు, విభిన్న పాత్రలు కలిసి ఆమెను ఇండియన్ సినిమా టాప్ హీరోయిన్‌గా నిలబెడుతున్నాయి. ఏది ఏమైన , స్టార్‌డమ్ తగ్గకుండా, మరింత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా రష్మిక ముందుకు సాగుతోంది.సినిమాలతో ఆమె పేరు మరింత మోగడం ఖాయంగా కనిపిస్తోంది

# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన



బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శు క్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్‌చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు.
ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# దురంధర్-2 ఓ చెత్త సినిమా

## అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు.ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.

## ఐపీఎల్ 2026 ముందు సంచలనం..

## వైభవ్ సూర్యవంశీపై రాజస్థాన్ రాయల్స్ స్పెషల్ ఫోకస్

**ఐపీఎల్ 2026 కు ముందు రాజస్థాన్ రాయల్స్ యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ పై చర్చ మొదలైంది. 14 ఏళ్ల ఈ కుర్రాడిని మీడియా ఒత్తిడికి దూరంగా ఉంచి, ఆటపై దృష్టి పెట్టేలా టీమ్ ప్లాన్ చేస్తోంది.**



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ జట్టులోని ఒక 14 ఏళ్ల కుర్రాడు హాట్ టాపిక్‌గా మారాడు. అతనే టీమిండియా భవిష్యత్తు ఆశాకిరణం వైభవ్ సూర్యవంశీ. అతి చిన్న వయసులోనే కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన ఈ వండర్ కిడ్ విషయంలో రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం, కెప్టెన్ రియాన్ పరాగ్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. వైభవ్‌ను మీడియా వెలుగులకు, సోషల్ మీడియా హడావుడికి దూరంగా ఉంచాలని నిర్ణయించారు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ స్వయంగా చిన్న వయసులోనే ఐపీఎల్‌లోకి వచ్చి ఎన్నో విమర్శలు, ఒత్తిళ్లు ఎదుర్కొన్నాడు. అందుకే, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా అలాంటి ఇబ్బందులు పడకూడదని పరాగ్ భావిస్తున్నాడు. అతి చిన్న వయసులో వచ్చే పాపులారిటీ వల్ల ఆటగాడి ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉందని, అందుకే వైభవ్‌ను అధికారిక ప్రెస్ మీట్లు, ఇంటర్వ్యూలకు దూరంగా ఉంచాలని టీమ్ మేనేజ్మెంట్ నిర్ణయించింది. సోషల్ మీడియాలో వచ్చే పొగడ్తలు, విమర్శలు అతనిపై ప్రభావం చూపకూడదనే ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అరంగేట్రంలోనే అద్భుత రికార్డు

వైభవ్ సూర్యవంశీ గత సీజన్‌లోనే తన ప్రతిభను ప్రపంచానికి చాటాడు. ఏప్రిల్ 19, 2025న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 14 ఏళ్ల 23 రోజుల వయసులో ఐపీఎల్ అరంగేట్రం చేసి, చరిత్రలోనే అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతకంటే గొప్ప విషయం ఏమిటంటే, తన ఐపీఎల్ కెరీర్‌లో ఎదుర్కొన్న మొట్టమొదటి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ అద్భుతమైన ఆరంభం అతన్ని రాత్రికి రాత్రే స్టార్‌ను చేసింది.

అండర్-19 వరల్డ్ కప్‌లో విధ్వంసం

వైభవ్ ఫామ్ కేవలం ఐపీఎల్‌కు మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవలే జరిగిన అండర్-19 వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అతను విశ్వరూపం చూపించాడు. కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌తో సెలక్టర్ల దృష్టిలో పడటమే కాకుండా, భారత క్రికెట్‌లో తదుపరి సూపర్ స్టార్ దొరికాడనే నమ్మకాన్ని కలిగించాడు.

సీనియర్ల హెచ్చరిక.. రెండో సీజన్ సవాల్

మాజీ టీమిండియా బౌలర్ లక్ష్మీపతి బాలాజీ మాత్రం వైభవ్‌కు ఒక హెచ్చరిక జారీ చేశారు. మొదటి సీజన్‌లో గుర్తుపట్టని ప్రత్యర్థులు, రెండో సీజన్ నాటికి అతని బలహీనతలపై రీసెర్చ్ చేసి వస్తారని బాలాజీ తెలిపారు. ఇలాంటి సమయంలో కుమార సంగక్కర వంటి దిగ్గజాల మార్గదర్శకత్వం వైభవ్‌కు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సాంకేతికతతో పాటు మానసిక దృఢత్వం కూడా ఈ సీజన్‌లో అతనికి పరీక్షగా మారనుంది.

క్రిస్ గేల్ రికార్డుపై కన్నేసిన వైభవ్

రాజస్థాన్ రాయల్స్ ఈసారి వైభవ్‌ను యశస్వి జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా పంపాలని యోచిస్తోంది. అనుభవం ఉన్న జైస్వాల్ పక్కన ఉంటే వైభవ్‌పై ఒత్తిడి తగ్గుతుందని టీమ్ ప్లాన్. వైభవ్ కూడా తన లక్ష్యాలను చాలా స్పష్టంగా పెట్టుకున్నాడు. ఐపీఎల్‌లో క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును బ్రేక్ చేయడమే తన లక్ష్యమని అతను ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026లో ఈ వండర్ కిడ్ ఎన్ని సంచలనాలు సృష్టిస్తాడో వేచి చూడాలి

## ఒక్కడే 14 సిక్సర్లు, 21 ఫోర్లతో ఏకంగా 193 పరుగులు..సత్తా చూడకుండా కేకేఆర్ వదిలేసిన డైమండ్

**మాజీ కేకేఆర్ ప్లేయర్ ఆర్య దేశాయ్ టీ20ల్లో సంచలనం సృష్టించాడు. సూరత్ క్రికెట్ లీగ్‌లో కేవలం 81 బంతుల్లోనే 14 సిక్సర్లు, 21 ఫోర్లతో 193 పరుగులు చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఐపీఎల్ 2026కు ముందు ఆర్య దేశాయ్ ఇలాంటి ప్రదర్శన చేయడం చర్చనీయాంశంగా మారింది.**



ఐపీఎల్ 2026 సందడి మరికొద్ది రోజుల్లో మొదలుకానుంది. అయితే ఈ మెగా టోర్నీకి ముందే ఒక 22 ఏళ్ల కుర్రాడు మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించాడు. ఒకప్పుడు కోల్‌కతా నైట్ రైడర్స్ నమ్మి తీసుకుని, ఆ తర్వాత వదిలేసిన ఆర్య దేశాయ్.. ఇప్పుడు తన బ్యాట్‌తో ఆ జట్టుకు చుక్కలు చూపించే రేంజ్‌లో చెలరేగిపోయాడు. సూరత్ క్రికెట్ లీగ్ 2026లో భాగంగా మార్చి 20న జరిగిన మ్యాచ్‌లో ఈ యువ ఓపెనర్ ఆడిన ఇన్నింగ్స్ చూసి క్రికెట్ ప్రపంచం నోరెళ్లబెడుతోంది. సూరత్ క్రికెట్ లీగ్ 2026లో భాగంగా లూత్రా పెగసాస్, కైలాష్ స్పోర్ట్స్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్య దేశాయ్ ఊహించని రీతిలో చెలరేగిపోయాడు. లూత్రా పెగసాస్ జట్టుకు కెప్టెన్‌గా, ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్య.. మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 81 బంతుల్లోనే 238.27 స్ట్రైక్ రేట్‌తో 193 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్సర్లు, 21 ఫోర్లు ఉండటం విశేషం. ఏ టీ20 లీగ్‌లోనైనా ఇప్పటివరకు నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరుగా ఇది రికార్డు సృష్టించింది.

ఒక్కడే జట్టు స్కోరును దాటేశాడు

లూత్రా పెగసాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 267 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇందులో ఆర్య దేశాయ్ ఒక్కడే 193 పరుగులు చేయడం గమనార్హం. 268 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కైలాష్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు.. కనీసం ఆర్య దేశాయ్ చేసిన స్కోరును కూడా అందుకోలేకపోయింది. ఆ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 174 పరుగులకే పరిమితమైంది. దీంతో లూత్రా పెగసాస్ 93 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఆర్య దేశాయ్ బ్యాటింగ్ ధాటికి ప్రత్యర్థి బౌలర్లు బంతులు వేయడానికే భయపడే పరిస్థితి కనిపించింది.

కేకేఆర్‌తో ఉన్న పాత కనెక్షన్

ఆర్య దేశాయ్ ప్రతిభను గుర్తించిన కోల్‌కతా నైట్ రైడర్స్.. ఐపీఎల్ 2023లో రిప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా కేవలం రూ.20 లక్షలకు తనతో ఒప్పందం చేసుకుంది. అయితే దురదృష్టవశాత్తు ఆ సీజన్‌లో అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం లభించలేదు. ఆ తర్వాత సీజన్ నుంచి కేకేఆర్ అతన్ని జట్టు నుంచి రిలీజ్ చేసింది. ఇప్పుడు అదే ఆటగాడు టీ20ల్లో ఇంతటి విధ్వంసం సృష్టించడం చూసి, అతన్ని వదులుకొని కేకేఆర్ తప్పు చేసిందని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

ఐపీఎల్ 2026 ముందు సంచలనం

మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026కు ముందు ఆర్య దేశాయ్ ఇలాంటి ప్రదర్శన చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏ ఆటగాడైనా వన్డేల్లో కూడా చేయడానికి కష్టపడే స్కోరును, ఈ 22 ఏళ్ల కుర్రాడు టీ20ల్లోనే చేసి చూపించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తులో టీమిండియా తరపున కూడా సత్తా చాటుతానని ఆర్య పరోక్షంగా సంకేతాలు ఇచ్చాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీలు కూడా ఈ యువ ఆటగాడిపై ఒక కన్నేసి ఉంచాల్సిన సమయం ఆసన్నమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముంబై ఇండియన్స్ నంబర్ వన్.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్లు బాదిన టీమ్ ఇదే

**అంటేనే ఫోర్లు, సిక్సర్ల వర్షం. సరిగ్గా ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు క్రికెట్ లవర్లను హుషారెత్తించే ఒక ఆసక్తికరమైన గణాంకం బయటకు వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక సిక్సర్లు బాదిన టీమ్ ఏది అనే ప్రశ్నకు సమాధానం దొరికింది.**



ఐపీఎల్ అంటేనే ఫోర్లు, సిక్సర్ల వర్షం. సరిగ్గా ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు క్రికెట్ లవర్లను హుషారెత్తించే ఒక ఆసక్తికరమైన గణాంకం బయటకు వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక సిక్సర్లు బాదిన టీమ్ ఏది అనే ప్రశ్నకు సమాధానం దొరికింది. ఈ రేసులో ముంబై ఇండియన్స్ అగ్రస్థానంలో నిలవగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బ్యాటర్ల విధ్వంసానికి అద్దం పట్టే ఈ రికార్డుల వివరాలు చూద్దాం.

ముంబై ఇండియన్స్

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరున్న ముంబై ఇండియన్స్ సిక్సర్లు బాదడంలోనూ నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటివరకు ఈ జట్టు మొత్తం 1823 సిక్సర్లు బాది రికార్డు సృష్టించింది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా వంటి పవర్‌ఫుల్ హిట్టర్లు ఈ జట్టులో ఉండటమే దీనికి ప్రధాన కారణం. గతంలో కీరన్ పొలార్డ్ వంటి విధ్వంసకర ఆటగాళు కూడా ఈ రికార్డులో కీలక పాత్ర పోషించారు. ముంబై టీమ్ అంటేనే ఆరంభం నుంచి ఆక్రమణ శైలిలో ఆడటం కాబట్టి, ఈ రికార్డు వారి ఖాతాలో చేరడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు.

ఆర్సీబీ

రెండో స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. విరాట్ కోహ్లీ వంటి స్టార్ ప్లేయర్ తో పాటు గతంలో ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ వంటి ప్రపంచ స్థాయి హిట్టర్లు ఈ జట్టుకు ఆడటంతో ఆర్సీబీ ఖాతాలో 1774 సిక్సర్లు చేరాయి. ముంబైకి, ఆర్సీబీకి మధ్య తేడా చాలా తక్కువగానే ఉంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ బ్యాటర్లు కనుక రెచ్చిపోతే, ముంబై రికార్డును అధిగమించే అవకాశం పుష్కలంగా ఉంది. ముఖ్యంగా చిన్నస్వామి స్టేడియంలో ఆడే మ్యాచ్‌లు ఆర్సీబీకి సిక్సర్ల వర్షం కురిపించడానికి బాగా కలిసివస్తాయి.

సీఎస్కే స్థానం ఏంటి

చెన్నై సూపర్ కింగ్స్ ఈ జాబితాలో 1610 సిక్సర్లతో మూడో స్థానంలో ఉంది. ధోనీ నాయకత్వంలోని ఈ జట్టు ఎప్పుడూ నిలకడగా రాణిస్తూనే వస్తోంది. అయితే, గత కొన్ని సీజన్లలో సిక్సర్ల వేగం ముంబై, ఆర్సీబీలతో పోలిస్తే కొంచెం తగ్గింది. అయినప్పటికీ టాప్ 3లో నిలవడం సీఎస్కే బ్యాటింగ్ బలానికి నిదర్శనం. సురేష్ రైనా, షేన్ వాట్సన్, స్వయంగా ఎంఎస్ ధోనీ బాదిన భారీ సిక్సర్లు ఈ రికార్డులో ప్రధానంగా ఉన్నాయి.

మారుతున్న ట్రెండ్

గత కొన్ని సంవత్సరాలుగా ఐపీఎల్‌లో బ్యాటింగ్ శైలి పూర్తిగా మారిపోయింది. కేవలం పాత జట్లే కాకుండా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ు), పంజాబ్ కింగ్స్ వంటి జట్లు కూడా సిక్సర్ల వర్షం కురిపిస్తున్నాయి. 2024 సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ ఒకే సీజన్‌లో 178 సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే 2025లో పంజాబ్ కింగ్స్ 173 సిక్సర్లు కొట్టి తమ సత్తా చాటింది. అంటే రాబోయే రోజుల్లో ఆల్-టైమ్ రికార్డులను కూడా ఈ చిన్న జట్లు తిరగరాసే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026లో ఈ సిక్సర్ల యుద్ధం ఇంకా ఎంత రసవత్తరంగా మారుతుందో వేచి చూడాలి.

## వరల్డ్ కప్ 2027 రూల్స్ ఇవే.. బౌండరీ లైన్ నుంచి సూపర్ ఓవర్ వరకు ఐసీసీ కీలక మార్పులు

**వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్ 2027 షెడ్యూల్, కొత్త రూల్స్ వచ్చేశాయి. 14 జట్లు, సూపర్ సిక్స్ ఫార్మాట్ తో ఈసారి టోర్నీ మరింత రసవత్తరంగా మారనుంది. ఈసారి టోర్నీ ఫార్మాట్ ఏంటి ఎన్ని జట్లు పాల్గొంటాయి కొత్తగా వచ్చిన రూల్స్ ఏంటో తెలుసుకుందాం.**




క్రికెట్ లవర్స్‌కు అతిపెద్ద పండుగ ఐసీసీ వన్డే వరల్డ్ కప్ 2027 ముంగిట్లోకి వచ్చేస్తోంది. వచ్చే ఏడాదే ఈ మెగా టోర్నీ జరగనుండటంతో ఇప్పుడే దీనిపై చర్చ మొదలైంది. ఈసారి టోర్నీ ఫార్మాట్ ఏంటి ఎన్ని జట్లు పాల్గొంటాయి? కొత్తగా వచ్చిన రూల్స్ ఏంటి? అన్న విషయాలపై ఐసీసీ ఇప్పటికే ఒక స్పష్టతనిచ్చింది. సౌత్ ఆఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిస్తున్న ఈ ప్రపంచకప్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు తలపడనున్నాయి. వీటికి ఎంట్రీ ఇచ్చే విధానం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌత్ ఆఫ్రికా, జింబాబ్వేలకు నేరుగా టోర్నీలో చోటు దక్కుతుంది. మరో హోస్ట్ నమీబియా మాత్రం క్వాలిఫైయింగ్ రౌండ్ ఆడి గెలవాల్సి ఉంటుంది. ఇక మార్చి 31, 2027 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న జట్లకు నేరుగా బెర్త్ కన్ఫర్మ్ అవుతుంది. మిగిలిన 4 స్థానాల కోసం 10 జట్ల మధ్య క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ జరుగుతుంది. అంటే ఈసారి పోటీ చాలా టఫ్ గా ఉండబోతోంది.

సూపర్ సిక్స్ ఫార్మాట్.. అదిరిపోయే ట్విస్ట్

ఈసారి ఐసీసీ పాత పద్ధతిని పక్కన పెట్టి సూపర్ సిక్స్ ఫార్మాట్‌ను తీసుకొచ్చింది. 14 జట్లను రెండు గ్రూపులుగా (గ్రూప్-ఏ, గ్రూప్-బి) విభజిస్తారు. ఒక్కో గ్రూప్‌లో 7 జట్లు ఉంటాయి. లీగ్ దశలో ప్రతి టీమ్ తన గ్రూప్‌లోని మిగిలిన జట్లతో తలపడుతుంది. రెండు గ్రూపుల నుండి టాప్-3 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. అక్కడ పాయింట్ల వేట ముగిశాక, టాప్-4లో ఉన్న జట్లు సెమీఫైనల్స్ కు వెళ్తాయి. ఆ తర్వాత ఫైనల్ పోరు జరుగుతుంది. దీనివల్ల ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్టుగా మారుతుంది.

వరల్డ్ కప్ 2027లో అమలయ్యే 3 కీలక సూత్రాలు ఈసారి టోర్నీలో ఐసీసీ మూడు ముఖ్యమైన నియమాలను కచ్చితంగా అమలు చేయనుంది. అవి:

సూపర్ ఓవర్ తప్పనిసరి:

2019 వరల్డ్ కప్ ఫైనల్ లో బౌండరీల ఆధారంగా విజేతను ప్రకటించిన వివాదం మనందరికీ గుర్తే. అందుకే 2023లో తెచ్చిన సూపర్ ఓవర్ రూల్ ఇక్కడ కూడా కొనసాగుతుంది. మ్యాచ్ టై అయితే ఎన్ని సార్లైనా సూపర్ ఓవర్ నిర్వహించి విజేతను తేలుస్తారు. నో సాఫ్ట్ సిగ్నల్: ఫీల్డ్ అంపైర్లు ఇచ్చే సాఫ్ట్ సిగ్నల్ వల్ల గతంలో చాలా వివాదాలు వచ్చాయి. ఇప్పుడు ఆ రూల్ లేదు. థర్డ్ అంపైర్ దగ్గర పక్కా ఆధారాలు ఉంటేనే అవుట్ ఇస్తారు, లేదంటే అంపైర్ డెసిషన్ లో మార్పు ఉండదు.

బౌండరీ డిస్టెన్స్:

స్టేడియం బౌండరీలు చిన్నవిగా ఉంటే బ్యాటర్లకు లాభం కలుగుతుంది. అందుకే ఏ స్టేడియంలో అయినా బౌండరీ లైన్ 70 మీటర్ల కంటే తక్కువ ఉండకూడదని ఐసీసీ నిబంధన విధించింది.

వేదికలు, షెడ్యూల్ విశేషాలు

ఈ మెగా టోర్నీకి సౌతాఫ్రికా ప్రధాన వేదికగా ఉండగా, జింబాబ్వే మరియు నమీబియాలోని కొన్ని స్టేడియాలను కూడా వాడుకోనున్నారు. ఆఫ్రికా గడ్డపై పేస్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లు ఉంటాయని మనందరికీ తెలిసిందే. కాబట్టి ఈ వరల్డ్ కప్ లో బౌలర్ల ఆధిపత్యం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. టీమ్ ఇండియా ఇప్పటికే తన కోర్ టీమ్ ను సిద్ధం చేసే పనిలో పడింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ర్యాంకింగ్స్ లో టాప్ లో ఉంటే మనకు డైరెక్ట్ ఎంట్రీతో పాటు మంచి అడ్వాంటేజ్ ఉంటుంది.

## PCBలో ముదురుతున్న సంక్షోభం- పాక్ బోర్డుపై గ్యారీ కిర్‌స్టన్ సంచలన వ్యాఖ్యలు- అసలేం జరుగుతోంది

**పాక్ బోర్డులో రాజకీయ జోక్యంపై గ్యారీ కిర్‌స్టన్ తీవ్ర అసహనం- నఖ్వీ నేతృత్వంలో కోచ్‌లకు కనీస గౌరవం లేదని విమర్శలు- ఓటమికి కోచ్‌లను బలిపశువులను చేయడం పీసీబీకి అలవాటే!**

ప్రపంచ క్రికెట్‌లో ఒకప్పుడు టాప్ జట్లతో ఒకటిగా వెలిగిన పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం అత్యంత గందరగోళ పరిస్థితిలో ఉంది. కేవలం ఆటగాళ్ల ప్రదర్శన మాత్రమే కాదు, తెరవెనుక బోర్డు వ్యవహారశైలి కూడా ఆ జట్టును పతనం దిశగా నడిపిస్తోంది. ఇటీవల ఆ జట్టు మాజీ వైట్ బాల్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పాక్ క్రికెట్ బోర్డు ్రాజదీలో ఉన్న 'టాక్సిక్' వర్క్ కల్చర్ గురించి ఆయన బయటపెట్టిన నిజాలు వింటే, అంతర్జాతీయ స్థాయిలో ఒక బోర్డు ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ఉంటుందో అర్థమవుతుంది. అసలు కిర్‌స్టన్ అంతటి వాడే పాక్ కోచ్ పదవికి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది? అక్కడ కోచ్‌లకు ఎదురవుతున్న అవమానాలు ఏంటి? అనే అంశాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఆ వివరాల్లోకి వెళితే..

అడుగడుగునా జోక్యం- పని చేసే వాతావరణం లేదు

శ్రీలంక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో గ్యారీ కిర్‌స్టన్ పాక్ బోర్డుపై విమర్శల వర్షం కురిపించారు. బోర్డు అధికారుల జోక్యం తాను గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెస్సింగ్ రూమ్ వెలుపల నుంచి వచ్చే అనవసరపు ఒత్తిడి, మర్యాద లేకపోవడం వల్ల ఆటగాళ్లతో కలిసి ఒక వ్యూహాన్ని రూపొందించడం కోచ్‌లకు అసాధ్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే తనకు ఎదురైన చేదు అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

పీసీబీ పాత పద్ధతి- కోచ్‌లే బలిపశువులు!

జట్టు ఏదైనా మ్యాచ్ ఓడిపోతే వెంటనే కోచ్‌లపై ఆంక్షలు విధించడం లేదా వారిని తొలగించడం పీసీబీకి పరిపాటిగా మారిందని కిర్‌స్టన్ విమర్శించారు. పరిపాలన పరమైన లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కోచ్‌లను బలిపశువులను చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. జట్టు ఆటతీరు సరిగ్గా లేనప్పుడు మద్దతు ఇవ్వాల్సింది పోయి, కోచ్‌ల అధికారాన్ని తగ్గించడం అనేది వినాశకరమని హెచ్చరించారు. కోచ్‌లకు స్వేచ్ఛ ఇవ్వనప్పుడు అసలు వారిని ఎందుకు నియమించుకుంటారని సూటిగా ప్రశ్నించారు.

రాజీనామాకు దారి తీసిన పవర్ స్ట్రగుల్

2024 టీ20 వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించిన తర్వాత బోర్డుకు, కోచ్‌కు మధ్య దూరం పెరిగింది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు కిర్‌స్టన్ చేసిన ప్రయత్నాలకు బోర్డు నుంచి సహకారం లభించలేదు. దీనికి తోడు సెలక్షన్ కమిటీలో హెడ్ కోచ్‌కు ఉన్న ఓటు హక్కును పీసీబీ తొలగించడం అసలు సమస్యకు దారి తీసింది. ఆస్ట్రేలియా పర్యటనకు జట్టును ఎంపిక చేయడంలో గానీ, మహమ్మద్ రిజ్వాన్‌ను కెప్టెన్ గా నియమించడంలో గానీ కిర్‌స్టన్ ప్రమేయం లేకుండానే నిర్ణయాలు జరిగిపోయాయి. దీంతో తన గౌరవాన్ని కాపాడుకోవడానికి ఆయన పదవి నుంచి తప్పుకున్నారు.

గిల్లేస్పీకి కూడా అదే అవమానం

కేవలం కిర్‌స్టన్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా దిగ్గజం జేసన్ గిల్లేస్పీ కూడా ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొన్నారు. ఇంగ్లాండ్‌పై చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ విజయం అందించినప్పటికీ, గిల్లేస్పీని బోర్డు పక్కన పెట్టింది. కనీసం ఆయనకు సమాచారం ఇవ్వకుండానే హై పెర్ఫార్మెన్స్ కోచ్ టిమ్ నీల్సన్‌ను పీసీబీ తొలగించింది. ఇది గిల్లేస్పీని తీవ్రంగా అవమానించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు ఉన్న చోట ఎంతటి గొప్ప కోచ్ వచ్చినా విజయం సాధించడం అసాధ్యమని కిర్‌స్టన్ వ్యాఖ్యానించారు.

జట్టులో ఇదే అసలైన లోపం

భారత్‌తో జరిగిన మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత, పాక్ జట్టులో కనీస ఐక్యత లేదని కిర్‌స్టన్ ఆటగాళ్లకు మొహం మీదే చెప్పినట్లు వార్తలు వచ్చాయి. బోర్డులో ఉన్న వర్గపోరు డ్రెస్సింగ్ రూమ్ మీద కూడా ప్రభావం చూపిస్తోందని ఆయన గ్రహించారు. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు నమ్మకం కోల్పోవడం, బోర్డు సభ్యుల రాజకీయాలు జట్టు ప్రదర్శనను దెబ్బతీస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. లాహోర్‌లోని బోర్డు కార్యాలయం నుంచి వచ్చే నిర్ణయాలు క్రికెట్ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన పంథాను మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆ జట్టు మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉంది. మోహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని బోర్డు ప్రొఫెషనల్స్ కు ఇచ్చే గౌరవం ఏంటో కిర్‌స్టన్, గిల్లేస్పీ ఉదంతాలు నిరూపించాయి. కిర్‌స్టన్ చేసిన కామెంట్స్ మళ్ళీ చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ్రాజదీ తరచుగా భారతదేశంపై ఏదో ఒక రకంగా విషం చిమ్ముతూనే ఉంటుంది. అయితే గురువులకు కనీసం గౌరవం ఇవ్వకుండా ఉండడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మరి కిర్‌స్టన్ కామెంట్స్ విషయంలో ్రాజదీ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# పాపన్నపేటలో అక్రమ ఇసుక నిల్వలపై దాడులు...

15 ట్రాక్టర్ల ఇసుక సీజ్...



పాపన్నపేట//**మార్చి 28 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకపై రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించి సుమారు 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. శుక్రవారం నమ్మదగిన సమాచారంతో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టగా గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక బయటపడింది. ఈ సందర్భంగా తహశీల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో రెవెన్యూ శాఖ ఆర్ఐ సత్తు స్వామి, జీపీవో పోచయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు...

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష కఠిన ఆదేశాలు...



పెద్దపల్లిటౌన్//**మార్చి 28 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్డు మరియు భవనాల శాఖ (ఆర్&బీ) అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సమగ్రంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిలో ఆలస్యం సహించబోమని హెచ్చరించారు. ముఖ్యంగా పెద్దపల్లి-కాటారం రహదారి విస్తరణ పనులు, వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. లింగాపూర్ రోడ్డులో జరుగుతున్న మీడియన్, పైప్‌లైన్ పనులను సమన్వయంతో పూర్తి చేయాలని, రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని అధికారులను ఆదేశించారు. మానేరు నదిపై ప్రతిపాదించిన వంతెనకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని, పనులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కునారం రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో, మార్గంలో ఉన్న ఇళ్లను మరియు ఇతర నిర్మాణాలను వెంటనే తొలగించి పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. భవనాల నిర్మాణంపై కూడా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. పెద్దపల్లిలో నిర్మించిన ఆర్&బీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ పనులు పూర్తయ్యాయని పేర్కొంటూ, వాటి వివరాలను ఎంబీ (వీడీ) రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని సూచించారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, మంథని స్టేడియంకు అవసరమైన అనుమతులను వేగంగా పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా త్రాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా సంబంధిత శాఖలతో సమన్వయం పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఈఈ (ఆర్&బీ) భావ్ సింగ్, డీఈలు, ఏఈలు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం...

భూపాలపల్లి జిల్లాలో సింగరేణి కార్మికుల సమస్యలపై ఉద్రిక్తత...



భూపాలపల్లి//**మార్చి 28 (ఆకాంక్ష) :** సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టిబిజికెఎస్, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారీ స్థాయిలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ మరియు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు టిబిజికెఎస్, బిఆర్ఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో



మెడికల్ బోర్డును తక్షణమే పునరుద్ధరించి, డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ.50 వేల కోట్లను వెంటనే చెల్లించాలని కోరారు. 2025 నుండి పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. మారు పేర్లు, విజిలెన్స్ అంశాలపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని హెచ్చరించారు. కార్మికుల జీవనోపాధితో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ఈ రోజు నిర్వహించిన నిరసన కార్యక్రమం కేవలం హెచ్చరిక మాత్రమేనని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు రవాణా వ్యవస్థ స్థంభించి, వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## రోడ్డు ప్రమాదంతో కాలు విరిగి మంచానికే

# పరిమితమైన మెకానిక్ జాఫర్

వి.ఎస్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వెలుగు స్వచ్ఛంద సంస్థ నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ

దాతలు ముందుకు రావాలని ఫౌండర్ డా. సురభి శ్రీధర్ విజ్ఞప్తి



గోదావరిఖనిటౌన్/**మార్చి 28 (ఆకాంక్ష) :** గోదావరిఖని మల్లికార్జున్ నగర్ ప్రాంతానికి చెందిన టూ వీలర్ మెకానిక్ జాఫర్ కుటుంబానికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఐదు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాఫర్ కాలు విరిగిపోవడంతో ప్రస్తుతం నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమై, కుటుంబ పోషణ కష్టసాధ్యంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్లు గడవేన సునీత, డా.సదానందం సహకారంతో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ మరియు చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ..సమాజంలో ఎక్కడ సమస్య ఉన్నా తమ వంతు సహాయం అందించడం వెలుగు సంస్థ లక్ష్యమని తెలిపారు. జాఫర్ గత 20 సంవత్సరాలుగా మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాడని, ప్రమాదం తరువాత వైద్య ఖర్చులు భరించే స్థోమత లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు. జాఫర్ కుటుంబానికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని, ముఖ్యంగా వైద్య ఖర్చుల కోసం సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ సురభి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకురాలు ఉరకొండ రజిత, జాఫర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాలను నివారించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి...

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్...







నాగర్‌కర్నూల్/**మార్చి 28 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ బాదవత్ సంతోష్ అన్నారు. అధిక ప్రమాదకర గర్భధారణలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సంరక్షణ అందిస్తే మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏఎన్ఎంలకు "సమీకృత అధిక ప్రమాదకర గర్భధారణ నిర్వహణ మరియు నియమావళి"పై ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో లింగ నిష్పత్తి ఆందోళనకరంగా ఉందని, 1000 మంది మగ శిశువులకు కేవలం 894 మంది అమ్మాయిలే జన్మిస్తున్నారని తెలిపారు. ఇది భవిష్యత్తులో సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. భ్రూణ హత్యలను పూర్తిగా నిర్మూలించేందుకు ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసినట్లయితే వెంటనే సమాచారం అందించాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా అన్ని దశల వైద్య పరీక్షలు చేయించుకునేలా పర్యవేక్షణ పెంచాలని, ముఖ్యంగా మొదటి కాన్పులో ఆడ శిశువు ఉన్న మహిళలు రెండోసారి గర్భవతులు అయితే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా అందించేందుకు అవగాహన పెంచాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 86 హైరిస్క్ గ్రామాల్లో ప్రత్యేక టిబి పరీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నందున ప్రజలు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన రాష్ట్ర శిక్షకులు డాక్టర్ కావ్య, డాక్టర్ శ్రావణి పీపీటీ ద్వారా అధిక ప్రమాదకర గర్భధారణ నిర్వహణపై శిక్షణ అందించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రీ టెస్ట్, పోస్ట్ టెస్టులు కూడా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కే. రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారాసింగ్, డాక్టర్ భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్, డాక్టర్ ప్రదీప్, పర్యవేక్షణ సిబ్బంది కోట్ర నిరంజన్, విజయ్ కుమార్, రాజేశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్లు నరసింహ, రాధా, పీహెచ్ఎన్ మంగమ్మ, డీడీఎం నవీనతో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 7న తిప్పాపూర్ గోశాలలో 300 కోడెల పంపిణీ...

చిన్న,సన్నకారు రైతులకు దరఖాస్తుల ఆహ్వానం...

పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, వ్యవసాయ అధికారుల ధృవపత్రం తప్పనిసరి...

రాజన్న సిరిసిల్ల//**మార్చి 28 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతులకు ఉపాధి, పశుసంవర్ధక రంగాభివృద్ధికి తోడ్పడే చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఏప్రిల్ 7వ తేదీన వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో 300 కోడెలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో మధ్యస్థం నుంచి పెద్ద పరిమాణంలో ఉన్న కోడెలను మంగళవారం ఉదయం 7 గంటలకు అర్హులైన రైతులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులతో పాటు ఉమ్మడి కరీంనగర్ మరియు పరిసర జిల్లాల చిన్న, సన్నకారు రైతులు అర్హులని స్పష్టం చేశారు. 1.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి కలిగిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల రైతులు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా ఏఈఓ జారీ చేసిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులు అవసరమైన పత్రాలతో ఏప్రిల్ 7న ఉదయం 7 గంటలకు తిప్పాపూర్ గోశాలకు హాజరుకావాలని సూచించారు. అర్హులైన వారికి మాత్రమే జియో ట్యాగింగ్ కలిగిన కోడెలను అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జియో ట్యాగింగ్ విధానం ద్వారా కోడెలు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ చేయవచ్చని, భవిష్యత్తులో వాటి సంరక్షణపై కూడా నిఘా ఉంచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను కచ్చితంగా నిర్వహించాల్సిందిగా సూచించారు. పంపిణీ చేసిన కోడెలను దుర్వినియోగం చేసినట్లు లేదా పక్కదారి పట్టించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు.

# చిన్న దూరమైనా సీట్ బెల్ట్ తప్పనిసరి...

రామగుండం పోలీస్ కమిషనర్ సీపీ అంబర్ కిషోర్ ఝా...



గోదావరిఖని//**మార్చి 28 (ఆకాంక్ష) :** రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన దారుల ప్రాణ రక్షణకు సీట్ బెల్ట్ వినియోగం అత్యంత కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అరైవ్ అలైవ్ ఫేజ్-XXX' కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని మున్సిపల్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝాతో పాటు పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 70 శాతం కేసుల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లనే తీవ్రమైన గాయాలు లేదా ప్రాణనష్టం జరుగుతున్నట్లు వెల్లడించారు. సీట్ బెల్ట్ వినియోగం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు.



ఫోర్ వీలర్ వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ఉన్నప్పటికీ సీట్ బెల్ట్ ధరించకపోతే అవి సమర్థవంతంగా పనిచేయవని స్పష్టం చేశారు. అందువల్ల చిన్న దూరమైనా, పెద్ద దూరమైనా ప్రతి ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వాహనం కొనుగోలు సమయంలో కూడా అధునాతన భద్రతా సదుపాయాలు కలిగిన మోడళ్లను ఎంచుకోవాలని ముఖ్యంగా ఎయిర్ బ్యాగులు, సీట్ బెల్ట్ రిమైండర్లు వంటి భద్రతా లక్షణాలను పరిశీలించాలని ప్రజలకు సూచించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవచ్చని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్ఐలు రమేష్, అనూష, మనోహర్, ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఫ్లెక్సీల బోర్డుగా మార్చొద్దు...

డివైఎఫ్ఐ ఆగ్రహం...



నాగర్ కర్నూల్//**మార్చి 28 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రాజకీయ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చడం అనైతికమని పేర్కొన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాలు వచ్చినప్పుడల్లా రాజకీయ నాయకులు విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయడం సర్వసాధారణంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం ముందు, వెనుక ఫ్లెక్సీలు కట్టే వారిపై మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ అయినా విగ్రహం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలోనే ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ. కుర్మయ్య, సుల్తాన్, మల్లికార్జున్, శివ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి పీహెచ్‌సీలో నిద్రమాత్రలు మింగిన ఏఎన్ఎం...



మెదక్//**మార్చి 28 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ)లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం రజిని నిద్రమాత్రలు మింగి అస్వస్థతకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. విధుల ఒత్తిడి, పని మార్పు సమస్యలతో కొంతకాలంగా మానసిక ఆందోళనకు లోనవుతున్నట్లు సమాచారం. శనివారం విధుల్లో ఉన్న సమయంలోనే రజిని నిద్రమాత్రలు మింగినట్లు తెలిసింది. ఆమె పరిస్థితిని గమనించిన సహోద్యోగులు వెంటనే స్పందించి సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుండగా, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ ఘటనకు పని మార్పు విషయంలో నెలకొన్న ఒత్తిడి కారణమై ఉండవచ్చని సహచరులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. ప్రభుత్వ వైద్యసిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిళ్లు, పని పరిస్థితులపై ఈ ఘటన మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, సహోద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి, బాధితురాలికి అవసరమైన సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మెదక్ జిల్లాలో విందు విషాదం...

41 మందికి అస్వస్థత...



మెదక్//**మార్చి 28 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో విందు కార్యక్రమం విషాదంగా మారింది. స్థానికంగా నిర్వహించిన ఓ ఫంక్షన్ హాల్‌లో విందు భోజనం చేసిన 41 మంది ఒక్కసారిగా అస్వస్థతకు గురవడం కలకలం రేపింది. భోజనం చేసిన కొద్ది సేపటికే బాధితులకు వాంతులు, విరోచనాలు ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు, నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందిస్తూ బాధితుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పరిస్థితి విషమించిన నలుగురు చిన్నారులను మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉందని సమాచారం. ఈ ఘటన ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే జరిగి ఉండవచ్చని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భోజనంలో వడ్డించిన ఆహార పదార్థాల వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని భావిస్తూ, సంబంధిత అధికారులు ఆహార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. నివేదికలు వచ్చిన తరువాత అసలు కారణం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు తగిన వైద్యం అందించడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ఘటనతో నర్సాపూర్ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. విందు కార్యక్రమాల్లో ఆహార భద్రతపై మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# నీటి పైప్‌లైన్ లీకేజీలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు...



గోదావరిఖని//**మార్చి 28 (ఆకాంక్ష) :** రామగుండం నగరంలో నీటి సరఫరా పైప్‌లైన్లలో ఏర్పడుతున్న లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. శారదానగర్‌లోని పీజీ కళాశాల ఎదుట డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ మరమ్మత్తు పనులను శనివారం ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. లీకేజీ కారణంగా ప్రశాంత్ నగర్ నుండి పవర్ హౌజ్ కాలనీ వరకు సుమారు నాలుగు డివిజన్లలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని సాయంత్రంలోపు మరమ్మత్తు పనులు పూర్తి చేసి, రేపటి నుండి నీటి సరఫరా యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా నీటి లీకేజీలు గుర్తించిన పక్షంలో ప్రజలు వెంటనే 9392483959 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, లేదా ఫోటోలు తీసి వాట్సాప్ ద్వారా పంపాలని మేయర్ సూచించారు. మునిసిపల్ సేవలకు సంబంధించిన ఏ సమస్యలైనా ఇదే నంబర్‌కు తెలియజేయాలని కోరారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి నీటి కనెక్షన్‌కు సరఫరా నిలిపివేసే వాల్వ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేసవిలో నీటి కొరత తలెత్తకుండా ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అన్ని చర్యలు చేపడుతున్నామని మేయర్ మహంకాళి స్వామి తెలిపారు.

## సింగరేణి చైర్మన్ కార్మిక సంఘాలను

# కలవటానికి నిరాకరణ... ఐఎఫ్‌టీయూ



గోదావరిఖని//**మార్చి 28 (ఆకాంక్ష) :** సింగరేణి సంస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందని, ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు కార్మికులకు శాపంగా మారుతున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ ఆరోపించారు. శనివారం గోదావరిఖనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో కార్మికులు అనేక సమస్యల మధ్య తప్పనిసరి పరిస్థితుల్లో సేవలు కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పలు చోట్ల అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల నియమితులైన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్‌ను కలవడానికి నెల రోజులుగా ప్రయత్నిస్తున్నప్పటికీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా సహకారం అందడం లేదని, కొత్తగూడెం హెడ్ ఆఫీస్‌లోకి ప్రవేశించడానికే అనేక ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. కార్మిక సంఘాల నాయకులను అధికారులను కలిసేందుకు లోనికి అనుమతించడం లేదని ఆరోపించారు. డైరెక్టర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) గౌతమ్ కూడా కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడటానికి నిరాకరిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులను కార్మికులు అర్థం చేసుకుని, యాజమాన్యం అహంభావానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఐ కృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఈ నరేష్, ఐ రాజయ్య, ఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు

# హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి...





గోదావరిఖని//**మార్చి 28 (ఆకాంక్ష) :** కాంట్రాక్ట్ కార్మికులకు పిసి పటేల్ కంపెనీ హైపవర్ కమిటీ నిర్ణయించిన వేతనాలను తక్షణమే చెల్లించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిసి పటేల్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని ఆరోపించారు. గుజరాత్‌కు చెందిన ఈ సంస్థ స్థానిక కార్మికులను బెదిరింపులకు గురి చేస్తోందని అన్నారు. గతంలో రామగుండం ఎమ్మెల్యే స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించామని చెప్పిన మాటలు అసత్యమని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కంపెనీలో 80 శాతం మంది నాన్ లోకల్ కార్మికులు పనిచేస్తుండగా, కేవలం 20 శాతం మాత్రమే స్థానికులు ఉన్నారని వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్ అమలు చేయాలని, సింగరేణి ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు కల్పించాలని, మెస్ బిల్లులు చెల్లించాలని, అదనపు పని గంటలకు ఓవర్‌టైమ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు ఆరెల్లి పోషం, కుమారస్వామి, రామచంద్రారెడ్డి, అనిల్‌తో పాటు పిసి పటేల్ కంపెనీ కార్మికులు రాజనర్సు, రాజు, నర్సింగ్, శివకుమార్, రవితేజ, పవన్, ఎస్అండ్ పీసీ ఉద్యోగులు మధు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### జి ఎం ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్
# ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా...



నగర్ కర్నూల్ టౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినపల్లి మండలం మంగనూరు గ్రామంలో జి ఎం ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా శనివారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జాక్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ యువకుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అప్పలి మాసయ్య యాదవ్ (లెక్చరర్), నారాయణ గౌడ్ (టీచర్), జి ఎం ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ మొబిలైజర్ రామకృష్ణ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ అందించి, అనంతరం తగిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ మంగనూరు అధ్యక్షుడు అల్వాల శ్రీకాంత్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఆవుల కృష్ణసాగర్, ఉపాధ్యక్షుడు బందెల శివకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు దిశానిర్దేశం చేస్తూ, శిక్షణ ద్వారా మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

# బిజినేపల్లిలో చలివేంద్రం ప్రారంభం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత ఐదేళ్లుగా నిరంతరంగా ఈ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు మరియు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తాగునీటి ఇబ్బందులు లేకుండా బిజినేపల్లి బస్టాండ్ వద్ద ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ సాగర్, ఆంజనేయులు, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాద ఆధిపత్యం ప్రపంచ శాంతికి విఘాతం...




నాగర్ కర్నూల్//మార్చి 28 (ఆకాంక్ష) : సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్య ధోరణి ప్రపంచ శాంతికి తీవ్రమైన విఘాతం కలిగిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం లక్ష్మణ చారి భవనంలో శనివారం జిల్లా సమితి సమావేశం తన్నీరు నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం బాల నరసింహ మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ దేశాల దూకుడు వైఖరి కారణంగా ప్రపంచం అశాంతి దిశగా వెళ్తోందన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులు కేవలం సైనిక చర్యలు కాకుండా ఆధిపత్య అహంకారానికి ప్రతీకలని విమర్శించారు. చమురు, సహజ వనరుల కోసం అమెరికా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలను తీవ్రంగా ఖండించారు. గతంలో ఇరాక్, వెనిజులా దేశాలపై చూపిన అదే విధానాన్ని ప్రస్తుతం ఇరాన్‌పై కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు దీనిని ఖండించకపోతే భవిష్యత్తులో మరిన్ని దేశాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారతదేశం విశ్వగురువని చెప్పుకునే సందర్భంలో, ఇలాంటి అంతర్జాతీయ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోవాలని సూచించారు. అమెరికా ప్రభావంతో దేశ ఆర్థిక,ఇంధన విధానాలు నడవడం సరికాదని, దేశానికి ప్రధాని ఎవరో స్పష్టంగా ఉండాలని వ్యాఖ్యానించారు. "యుద్ధం వద్దు శాంతి ముద్దు" అనే నినాదంతో సిపిఐ దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నా, భూమి స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలు కనిపిస్తున్నాయని, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తగినంత ఇంధనం అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, కృష్ణాజీ, కుతుబుద్దీన్, బండి లక్ష్మీపతి, మారేడు శివశంకర్, ఖాజా మైనుద్దీన్, రవీందర్, తుమ్మల శివుడు, దేశమని ఆంజనేయులు, మధు గౌడ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులతో లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలి...
కలెక్టర్ బాదావత్ సంతోష్...






నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ లాభదాయక పంటల సాగుపై దృష్టి సారించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. అధిక సాంద్రత కలిగిన పత్తి సాగు ద్వారా మంచి దిగుబడి సాధించి అధిక లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. శనివారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, పంట ప్రదర్శన మరియు అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది రైతులు వరి సాగుపైనే ఆధార పడుతున్నారని, దీని వల్ల ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవచ్చని తెలిపారు. రైతులు తమ భూమిలో కొంత భాగంలో వరి సాగు చేసి, మిగతా భాగంలో పంట మార్పిడి పద్ధతులను అనుసరించాలని సూచించారు. కూరగాయల సాగు, పండ్ల తోటలు, తోటల పెంపకం, ఆయిల్ ఫామ్ వంటి పంటలను ప్రోత్సహిస్తూ ఆదాయం పెంచుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఒకే రకమైన పంటను పండించడం కన్నా పంట మార్పిడి చేయడం ద్వారా భూమి సారవంతత పెరగడంతో పాటు రైతులకు ఆర్థికంగా లాభదాయకమని వివరించారు. అధిక సాంద్రత కలిగిన పత్తి సాగు ద్వారా ఎకరానికి సుమారు 25 వేల మొక్కలు పెంచవచ్చని, తక్కువ వ్యవధిలో పంట దిగుబడి రావడం వల్ల రైతులకు త్వరితగతిన ఆదాయం లభిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ పద్ధతిని అవలంబించాలని ఆయన రైతులను కోరారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నదని, ఎకరాకు సుమారు రూ.51 వేల వరకు మొక్కలు, డ్రిప్ వ్యవస్థ, నిర్వహణ ఖర్చులు వంటి సహాయాలను అందజేస్తోందని తెలిపారు. రైతులు మూడు సంవత్సరాల పాటు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే నాలుగో సంవత్సరం నుండి ఆదాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కాలంలో అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శైల, డాక్టర్ ఆదిశంకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి వెంకటేశం, వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, హార్టికల్చర్ అధికారులు జగన్, లక్ష్మణ్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# హైరిస్క్ గర్భధారణపై అప్రమత్తత అవసరం...
కరీంనగర్ మెడికవర్ వైద్యులు...




పెద్దపల్లిటౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : గర్భధారణ సమయంలో తలెత్తే ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండటం అత్యంత కీలకమని, తల్లి బిడ్డల క్షేమం కోసం సమగ్ర వైద్య పర్యవేక్షణ అవసరమని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీనయన, క్రిటికల్ కేర్ నిపుణురాలు డాక్టర్ పల్లవి హైరిస్క్ ప్రెగ్నెన్సీపై వివరించారు. గర్భధారణ సమయంలో తల్లికి లేదా గర్భంలోని శిశువుకు ప్రాణాపాయం కలిగించే ఆరోగ్య సమస్యలు ఉన్న పరిస్థితిని 'హైరిస్క్ ప్రెగ్నెన్సీ'గా పరిగణిస్తారని వారు తెలిపారు. డయాబెటిస్, రక్తపోటు, గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులు ఉన్న గర్భిణుల్లో ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అదేవిధంగా గర్భధారణ సమయంలో వచ్చే థైరాయిడ్ సమస్యలు, శిశువు బలహీనత, గర్భసంచి సమస్యలు కూడా హైరిస్క్‌కు దారితీస్తాయని పేర్కొన్నారు. గతంలో ఎక్కువ శస్త్రచికిత్సలు జరగడం, ప్లాసెంటా ముందుగానే వేరుపడటం, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం వంటి పరిస్థితులు కూడా గర్భధారణను క్లిష్టతరం చేస్తాయని వైద్యులు వివరించారు. హైరిస్క్ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ ప్రతి దశలోనూ అవసరమైన స్కానింగ్‌లు చేయించుకోవాలని సూచించారు. గైనకాలజిస్టులతో పాటు అవసరాన్ని బట్టి కార్డియాలజీ, నెఫ్రాలజీ వంటి విభాగాల నిపుణుల సలహాలు తీసుకోవడం మంచిదన్నారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం, చిన్నపాటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత అవసరమని తెలిపారు. మెడికవర్ వంటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అత్యాధునిక ఐసీయూ వసతులు, క్రిటికల్ కేర్ నిపుణుల పర్యవేక్షణ అందుబాటులో ఉండటం వల్ల క్లిష్ట పరిస్థితుల్లోనూ తల్లి, బిడ్డలను సురక్షితంగా కాపాడవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు గడువు పొడిగింపు...
మూడు నెలల అదనపు అవకాశం

బకాయిల చెల్లింపులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టీకరణ...



పెద్దపల్లి//మార్చి 28 (ఆకాంక్ష) : డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు ప్రభుత్వం ఊరట కల్పిస్తూ బకాయిల చెల్లింపులకు మరో మూడు నెలల గడువును పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2014-15 నుండి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023-24 వరకు (రబీ 2022-23 సీజన్‌కు చెందిన ఆక్షన్ ధాన్యం మినహా) బకాయిలు ఉన్న రైస్ మిల్లర్లు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం 90 రోజులలోపు ఎఫ్.ఆర్.కే సన్నబియ్యం (ఫోర్టిఫైడ్ సన్నబియ్యం) లేదా నగదు రూపంలో బకాయిలను చెల్లించాల్సి ఉందని గుర్తుచేశారు. బకాయి మొత్తానికి 125 శాతం తో పాటు 12 శాతం వడ్డీ చెల్లించాలనే నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నిర్దేశించిన గడువు ముగియడంతో, ప్రభుత్వ స్థాయిలో పునఃసమీక్ష జరిపి బకాయిల వసూళ్లను వేగవంతం చేయడం, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ప్రయోజనాలను కాపాడడం లక్ష్యంగా గడువును మరో మూడు నెలలు పొడిగిస్తూ మార్చి 25న ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకుని, ఎఫ్.ఆర్.కే సన్నబియ్యం లేదా నగదు రూపంలో బకాయిలను నిర్ణీత గడువులోపు చెల్లించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ బకాయిలను పూర్తిగా చెల్లించడం ద్వారా సంస్థతో ఉన్న ఒప్పంద బాధ్యతలను నెరవేర్చాలని ఆయన సూచించారు.

### పెద్దపల్లి జిల్లాలో ఇంధన నిల్వలు
# సమృద్ధిగా 1655 ఖూ స్టాక్ సిద్ధం...
ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష..



పెద్దపల్లిటౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలో పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ) నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 108 పెట్రోల్ బంకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, రోజువారీ సగటు ఇంధన విక్రయాలు 255 కిలోలీటర్లుగా నమోదవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో పెట్రోల్ 82 కిలోలీటర్లు, డీజిల్ 173 కిలో లీటర్లుగా ఉన్నాయని తెలిపారు. గడిచిన రోజున మొత్తం 240 కిలోలీటర్ల ఇంధనం విక్రయించబడగా, ఇందులో పెట్రోల్ 78 కిలోలీటర్లు, డీజిల్ 162 కిలోలీటర్లుగా నమోదైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1655 కిలోలీటర్ల ఇంధన నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, ఇందులో పెట్రోల్ 624 కిలోలీటర్లు, డీజిల్ 1031 కిలోలీటర్లుగా ఉన్నాయని వివరించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) సంస్థల ద్వారా సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎటువంటి అంతరాయం లేదని, ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో స్వచ్ఛభారత్...
వనమహోత్సవం అవగాహన సదస్సు...



పెద్దపల్లిటౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్ మరియు వనమహోత్సవం'పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై వక్తలు వివరణాత్మకంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సత్యనారాయణ, జిల్లా స్వచ్ఛభారత్ డైరెక్టర్ ఎస్. రాఘవులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి జీవనశైలిగా మారాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. వనమహోత్సవం (హరితహారం)లో భాగంగా ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపు వల్లే సమృద్ధిగా వర్షాలు కురిసి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పారిశుద్ధ్యంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సదస్సులో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నాగర్ కర్నూల్ జిల్లాలో
# వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో చర్లకోల శ్వేత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి పట్టుదలతో సాధన చేస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గుర్తింపు సాధించవచ్చన్నారు. క్రీడల ద్వారా స్నేహభావం పెరిగి పరస్పర సహకారం బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ధర్మారం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన...
అధికారులకు పలు ఆదేశాలు...

సేవలు వేగవంతం చేయాలని సూచనలు...



పెద్దపల్లిటౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విస్తృతంగా పర్యటించారు. మండలంలోని తహసిల్దార్ కార్యాలయం, కేజీబీవీ విద్యాసంస్థలను కలెక్టర్ తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ భారతి ఆన్‌లైన్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలను పారదర్శకంగా అందించాలని సూచించారు. కేజీబీవీ పర్యటనలో భాగంగా విద్యార్థినులకు అందిస్తున్న సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. బాలికలకు నాణ్యమైన, పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కేజీబీవీ భవనాల మరమ్మత్తు పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గోదారమ్మకు ఎల్లమ్మ బోనం సమర్పించిన
# గౌడ సంఘం నాయకులు...



గోదావరిఖని//మార్చి 28 (ఆకాంక్ష) : శ్రీ రేణుక ఎల్లమ్మ మారుబోనాల సందర్భంగా శనివారం గౌడ సంఘం సభ్యులు, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు గోదారమ్మకు తొలి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడపావనం శుద్ధి, పట్నాలు వేసే కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా చేపట్టారు. గోదావరిఖని శివారులోని సమ్మక్క-సారలమ్మ జాతర గద్దెల వద్ద బోనం కుండను అలంకరించి, అక్కడి నుంచి ఊరేగింపుగా గోదావరి నది తీరానికి తీసుకువెళ్లారు. నది ఒడ్డున పట్నాలు వేసి గోదారమ్మకు బోనం సమర్పించి, గడపావనం శుద్ధి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెరుగు హనుమంత్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి తొలి వార్షికోత్సవం, తిరుగు బోనాల నేపథ్యంలో గోదావరికి తొలి బోనం సమర్పించడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు నుంచి బోనాల పండుగ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, జోగు కార్యక్రమం కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి గౌడ కుటుంబాన్ని కలిసే గడపావనం సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఇంటికి వచ్చిన గడపావనాన్ని సాదరంగా ఆహ్వానించి కనుమలు, దక్షిణ ఇచ్చి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మెరుగు యాదగిరి గౌడ్, కోట రవి గౌడ్, బాలసాని స్వామి గౌడ్, మండ రమేష్ గౌడ్, బిందె నాగభూషణం, మాచిడి మహేందర్, రంగు కృష్ణ, గన్నాల శ్రీదర్, కోడూరి రవి, బాలసాని శ్రీదర్, రామస్వామి, గడ్డం రవి, మోడెం సురేందర్, చేపూరి శ్రీను, పొన్నం అంజయ్య, మూల అశోక్, వంగ లక్ష్మీపతి, గోపగాని నవీన్, బుర్ర శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు మెరుగు విజయ, బాలసాని పద్మ, గుర్రం పద్మ, సరస్వతి, లత తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

### ఉద్యోగుల మౌలిక సౌకర్యాల
# కోసం ఏప్రిల్ 3న సిఐటియు నిరసన దీక్ష...



గోదావరిఖని//మార్చి 28 (ఆకాంక్ష) : సింగరేణి పరిధిలోని జీడీకే-11ఇంక్లైన్ గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3న నిర్వహించనున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి శనివారం గేట్ మీటింగ్‌లో వెల్లడించారు. జీడీకే-11 ఇంక్లైన్ వద్ద జంగపల్లి మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గనిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని వి మర్శించారు. గత మూడు నెలలుగా రెండు సార్లు కార్మికుల సంతకాలతో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు భోజనం చేసే సమయంలో కోతులు, కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పైభాగంలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే, అండర్‌గ్రౌండ్‌లో మరింత క్లిష్ట పరిస్థితుల్లో కార్మికులు పనిచేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో సరైన గాలి సదుపాయం లేక కార్మికులు పని ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులకు క్రచ్, విశ్రాంతి గదులు, అండర్‌గ్రౌండ్‌లో ప్రత్యేక వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించిన డిగ్రీ విద్యార్థులు...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బిజినపల్లి మండలంలోని పాలెం ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ కర్మాగారాన్ని సందర్శించారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి అధికారి దివ్య, పారిశ్రామిక వేత్త వేణు తుమ్మల రీసైక్లింగ్ ప్రక్రియ, దాని ప్రయోజనాలపై వివరించారు. ప్రిన్సిపాల్ మదన్ మోహన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సమస్యపై విద్యార్థుల్లో బాధ్యతాభావం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్...
కేశోవరం సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎగ్లాస్పూర్...

జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు...



మంథని//మార్చి 28 (ఆకాంక్ష) : మంథని మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శనివారం బసంత్ నగర్‌లో ఉన్న కేశవరం సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించారు. పరిశ్రమల పనితీరు, ఉత్పత్తి ప్రక్రియలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకునేందుకు ఈ పర్యటన ఉపయోగపడింది. ఈ సందర్భంగా విద్యార్థులు సిమెంట్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు అయిన ఐరన్, జిప్సం వంటి వాటిని క్రషర్ ద్వారా ఎలా నూరుతారు, బొగ్గుతో హీట్ చేసే విధానం ఎలా ఉంటుందో పరిశీలించారు. అనంతరం ముడి పదార్థాలను కలిపి మళ్లీ క్రషర్ ద్వారా పొడి చేసి సిమెంట్‌గా తయారు చేసే ప్రక్రియను ప్రత్యక్షంగా గమనించారు. అలాగే తయారైన సిమెంట్‌ను బ్యాగుల్లో నింపే విధానం, మిషన్ల సహాయంతో గూడ్స్ రైళ్లలో లోడ్ చేసే విధానం వంటి ఆధునిక సాంకేతికతను విద్యార్థులు దగ్గరగా పరిశీలించారు. పూర్తిగా ఆటోమేటిక్ సిస్టమ్‌తో నడిచే ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను సందర్శించి, సిమెంట్ తయారీ విధానంపై ప్రాక్టికల్ అవగాహన పొందారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్‌ను పాఠశాల హెడ్‌మాస్టర్ జి. జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించగా ఉపాధ్యాయులు సంతోష్, రవి, సుచిత్ర, రాజశేఖర్, శ్రీనివాస్, మంజుల, పోచం, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన పెంచడంలో ఇలాంటి పర్యటనలు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయులు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి గౌరవం...

### స్త్రీనిధి రుణాల పంపిణీ, వసూళ్లలో అగ్రస్థానం...

### పలు పురస్కారాలు కైవసం...



పెద్దపల్లిటౌన్//మార్చి 28 (ఆకాంక్ష) : స్త్రీనిధి రుణాల పంపిణీ మరియు వసూళ్లలో విశేష ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనతో పలు పురస్కారాలను సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన స్త్రీనిధి 13వ జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క, సెర్ప్ సీఈఓ & మెప్మా ఎండీ దివ్య దేవరాజన్ చేతుల మీదుగా ఈ అవార్డులు ప్రదానం చేయడం జరిగింది. మున్సిపల్ పరిధిలో (మెప్మా) రుణాల పంపిణీ మరియు వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచినందుకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణ శ్రీ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో (సెర్ప్) స్త్రీనిధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీమతి ఎం. కాళిందిని గారు కూడా పురస్కారాన్ని స్వీకరించారు. ఇదే సందర్భంగా స్త్రీనిధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి బి. రవీందర్‌ను సత్కరించారు. అలాగే మొత్తం జిల్లా స్థాయిలో (సెర్ప్ & మెప్మా) అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆర్. దుర్గా ప్రసాద్‌కు అత్యున్నత పురస్కారం అందజేశారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో స్త్రీనిధి విభాగం సమర్థవంతంగా పని చేస్తూ అద్భుత ఫలితాలు సాధించిందని అధికారులు తెలిపారు. ఈ విజయానికి సెర్ప్, మెప్మా మరియు స్త్రీనిధి సిబ్బంది సమష్టి కృషే కారణమని, వారి నిబద్ధత, సమన్వయం వల్లే రాష్ట్రస్థాయి గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు.

## జడ్చర్ల మండలం మిడ్జిల్ గ్రామ పంచాయతీకి భారీ ఆదాయం...




జడ్చర్ల//మార్చి 28 (ఆకాంక్ష) : జడ్చర్ల మండలంలోని మిడ్జిల్ గ్రామ పంచాయతీకి పశువుల సంత, అంగడి బజార్ ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. శనివారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎడ్ల శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ వేలం పాటలో మొత్తం రూ.21 లక్షల 33 వేల ఆదాయం వచ్చినట్లు ఎంపీవో రాజశేఖర్ రెడ్డి తెలిపారు. వేలం ప్రక్రియలో భాగంగా పశువుల సంతను రూ.19 లక్షల 60 వేలకి గ్రామానికి చెందిన రామ్ గౌడు దక్కించుకోగా, కూరగాయల సంతను రూ.1 లక్ష 73 వేలకి మరో కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడిందని అధికారులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చేపట్టిన ఈ చర్యలతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయన్న, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహణ...



హుజురాబాద్//మార్చి 28 (ఆకాంక్ష) : హుజురాబాద్‌లోని తెలంగాణ అల్పసంఖ్యాకుల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ఎర్త్ అవర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో (ఔఔఫ్) మరియు బీసీఐ ఉత్తమ పత్తి యాజమాన్య పథకం భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ పత్తి యాజమాన్య పథకం అసిస్టెంట్ మేనేజర్ రామారావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి నెల చివరి శనివారం రోజున ప్రపంచవ్యాప్తంగా ఒక గంట పాటు లైట్లు ఆఫ్ చేయడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ తగ్గించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. 2007లో (ఔఔఫ్) ప్రారంభించిన ఈ ఎర్త్ అవర్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను తెలియజేస్తుందని చెప్పారు. పర్యావరణ రక్షణ, వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజలు, కంపెనీలు, ప్రభుత్వాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని వివరించారు. మార్చి నెల చివరి శనివారం రాత్రి 8:30 నుండి 9:30 గంటల వరకు స్వచ్ఛందంగా ఇంట్లో అవసరం లేని లైట్లు ఆఫ్ చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై చర్చలు జరపడం, చెట్లు నాటడం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, బీసీఐ క్షేత్ర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

### మంథని పట్టణంలో పిడిఎస్ బియ్యం

## అక్రమ రవాణా బట్టబయలు...



మంథని//మార్చి 28 (ఆకాంక్ష) : మంథని మున్సిపల్ పరిధిలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. పట్టణంలోని పద్మశాలి వీధి వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆటోలో తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, గంట సమ్మయ్య అనే వ్యక్తి ఆటోలో పది ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 4.60 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుబడ్డాడు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.21,080గా సివిల్ సప్లై అధికారులు అంచనా వేశారు. ప్రాథమిక విచారణలో, ఈ బియ్యాన్ని బేగంపేటకు చెందిన తూర్పాటి రాజుకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితుడు వెల్లడించాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సివిల్ సప్లై అధికారులను అప్రమత్తం చేసి, తదుపరి చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై గంట సమ్మయ్య, తూర్పాటి రాజులపై కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్సై రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

### పోత్కపల్లిరూపునారాయణపేట

## రహదారి విస్తరణపై వివాదం తీవ్రం...

ఓదెల//మార్చి 28 (ఆకాంక్ష) : పోత్కపల్లి గ్రామం నుండి రూపునారాయణపేట వరకు రెండు వరసల రహదారి మంజూరు కావడంతో ప్రారంభమైన పనులు ఇప్పుడు వివాదానికి దారితీశాయి. స్థానిక ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేసి శంకుస్థాపన చేసిన అనంతరం, ఆర్ అండ్ బీ అధికారులు గ్రామానికి చేరుకుని ప్రస్తుత 12 ఫీట్ల సిమెంట్ రోడ్డును ఇరువైపులా విస్తరించి మొత్తం 40 ఫీట్ల రహదారిగా అభివృద్ధి చేయాలని కొలతలు తీసి మార్కింగ్ చేశారు. ఈ క్రమంలో రహదారికి ఆనుకుని ఉన్న కొన్ని ఇళ్ల ప్రహరీ గోడలను తొందరపాటుగా కూల్చివేయడం జరిగింది. అయితే, తరువాత అనూహ్యంగా రహదారి వెడల్పును 40 ఫీట్ల నుంచి 36 ఫీట్లకు తగ్గించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శనిగరపు రమేష్ స్పందిస్తూ, ప్రభుత్వం అధికారికంగా రహదారి వెడల్పు తగ్గించిందా లేదా కొందరి ప్రయోజనాల కోసం మార్పులు జరిగాయా అని ప్రశ్నించారు. ఇప్పటికే గోడలు కూల్చి వేయడంతో నష్టపోయిన బాధితులకు పరిహారం ఎవరు చెల్లిస్తారు? దీనికి ఆర్ అండ్ బీ అధికారులు లేదా స్థానిక నాయకులు బాధ్యత వహిస్తారా? అని ఆయన నిలదీశారు. నష్టపోయిన వారికి తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# సమాజంలో ప్రశాంతత నెలకొల్పడమే లోక్ అదాలత్ లక్ష్యం...

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి...

### డిఎల్ఎస్ఎ చైర్మన్ రమాకాంత్...



నాగర్ కర్నూల్//మార్చి 28 (ఆకాంక్ష): సమాజంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడమే లోక్ అదాలత్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (ఢిలాసా) చైర్మన్ రమాకాంత్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థానం కోర్టు హాలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ, సమాజంలో కొంతమంది విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతూ కేసుల పాలవుతూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇటువంటి కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి పరిష్కారం కాని కేసులతో కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రధాన న్యాయస్థానం ఆదేశాల మేరకు లోక్ అదాలత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల అంగీకారంతో కేసులు పరిష్కరించుకుంటే వేగవంతమైన న్యాయం లభిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా కక్షిదారుల సమయం, డబ్బు వృథా కాకుండా కాపాడటం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. వివాహ సంబంధిత కేసులపై మాట్లాడిన ఆయన, పిల్లలు ఉన్న దంపతులు పట్టుదలతో విడిపోవడానికి సిద్ధమవుతుండటంతో పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. భార్యాభర్తలు పరస్పరం అర్థం చేసుకుని కలిసి జీవిస్తే కుటుంబాలు బలపడటంతో పాటు పిల్లల భవిష్యత్తు కూడా మంచిగా ఉంటుందని సూచించారు. కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం (మెడియేషన్) కీలకమని పేర్కొన్న ఆయన, అనుభవజ్ఞులైన న్యాయవాదులను నియమించి ఇరుపక్షాలను సంతృప్తి పరుస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, సమాజంలో ప్రశాంతతను కాపాడే విధంగా జీవించాలని పిలుపునిచ్చారు. నేరరహిత సమాజ నిర్మాణానికి లోక్ అదాలత్ మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని న్యాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోక్సో న్యాయమూర్తి నసీమా సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రవికాంతారావు, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, పోలీసు శాఖ అధికారులు, బ్యాంకు మేనేజర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

# అబుదాబిపై క్షిపణి దాడి - శకలాలు తగిలి ఐదుగురు భారతీయులకు గాయాలు



### యూఏఈపై ఇరాన్ క్షిపణి దాడి- శకలాలు తగిలి ఐదుగురు భారతీయులకు గాయాలు- వదంతులు నమ్మొద్దని అబుదాబి మీడియా సూచన

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో గత కొద్ది రోజులుగా యూఏఈపై జరుగుతున్న దాడులు అక్కడి ప్రవాస భారతీయుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ నుంచి వస్తున్న డ్రోన్లు, క్షిపణుల దాడుల్లో భారతీయులు గాయాలపాలవడం, ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలు జరుగుతున్నాయి. శనివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) లక్ష్యంగా జరిగిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణిని యూఏఈ వైమానిక రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుంది. కానీ ఆ క్షిపణి శకలాలు జనావాసాలు, పారిశ్రామిక ప్రాంతాల సమీపంలో పడ్డాయి. దీంతో ఆ శకలాలు అక్కడున్న ప్రజలకు తగిలాయి. ఈ ఘటన అబుదాబిలోని కీలక పారిశ్రామిక ప్రాంతమైన ఖలీఫా ఎకనామిక్ జోన్స్ 'కేజాద్' సమీపంలో జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఈ ఘటనపై వచ్చే వదంతులు నమ్మొద్దని అబుదాబీ మీడియా ప్రజలకు సూచించింది.

అమెరికా సైనికులకు గాయాలు

గత నెల రోజులుగా పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా సాగుతోంది. ఇరాన్ వ్యాప్తంగా ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపిస్తుంటే, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. డిమోనాలోని అణు సదుపాయాలపై క్షిపణులను ప్రయోగించిన హూతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై అధికారికంగా యుద్ధం ప్రకటించారు. సౌదీపై ఇరాన్ చేసిన భీకర దాడుల్లో 15 మంది అమెరికా సైనికులు గాయపడ్డట్లు సమాచారం. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సైన్యాలు యుద్ధవిమాలతో విరుచుకుపడ్తున్నాయి. కర్మాన్‌షా ప్రావిన్స్‌లో జరిగిన దాడిలో గర్భిణి సహా పలువురు మరణించారు. జాంజాన్ నగరంలోని అపార్ట్‌మెంట్ దెబ్బతిని ఐదుగురు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. దక్షిణ టెహ్రాన్‌లో క్షిపణి తాకి నివాస భవనం ధ్వంసమైంది. ఇక్కడ ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉంది. లెబనాన్‌లోని క్ఫార్ టెబ్నిట్ పట్టణంలో ఇజ్రాయెల్ సైనికుల కాల్పుల్లో ఒక వైద్యుడు మరణించగా నలుగురు గాయపడ్డారు. అక్కడి లిటాని నది వరకు సైన్యాన్ని మోహరించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. బీరూట్‌పై ఐడీఎఫ్ బాంబులు కురిపించగా నలుగురు రైతులు మృతిచెందారు. 50కి పైగా యుద్ధవిమానాలతో ఇరాన్‌లోని ఆయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఇరాన్ ప్రతీకార దాడులు

ఇజ్రాయెల్‌తో పాటు అరబ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ మిస్సైళ్ల రాకతో ఇజ్రాయెల్ అంతటా సైరన్లు మోగాయి. ప్రజలు బంకర్లలోకి పరుగులు తీశారు. టెల్అవీవ్‌లో ఇరాన్ క్షిపణి ధాటికి భారీ ఆస్తినష్టం వాటిల్లింది. ఒక ఇజ్రాయెలీ పౌరుడు మరణించగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరాన్ క్షిపణి దాడిలో ఇజ్రాయెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దెబ్బతింది. లెబనాన్ సరిహద్దుల్లో హెజ్బొల్లా జరిపిన యాంటీ ట్యాంక్ మిస్సైల్ దాడిలో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. యెమెన్‌లోని హూతీ రెబెల్స్ కూడా ఇజ్రాయెల్‌పై అధికారికంగా యుద్ధం ప్రకటించారు. ఇజ్రాయెల్‌లోని అణు కేంద్రం ఉన్న డిమోనా సమీపంలో హూతీలు ప్రయోగించిన క్షిపణులను ఐరన్‌డోమ్ కూల్చివేసింది. ఇరాన్ నుంచి నిరంతరంగా క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ.. వాటిని అడ్డుకునే ఇంటర్‌సెప్టార్‌లను ఇజ్రాయెల్ పొదుపుగా వాడుతోంది. మధ్య, దీర్ఘశ్రేణి ఇంటర్‌సెప్టార్‌లపై పరిమితులు పెట్టినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఇరాన్ దాడుల్లో బహ్రెయిన్‌లో ఓ భవన సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తమ గగనతలంలోకి వచ్చిన క్షిపణులు, డ్రోన్లను అడ్డుకున్నట్లు యూఏఈ, సౌదీ తెలిపాయి. కువైట్‌లోని అతిపెద్ద ఓడరేవుపై ఇరాన్ దాడి చేయగా దట్టమైన నల్లని పొగ అలుముకుంది. కువైట్ విమానాశ్రయం సైతం డ్రోన్ దాడిలో దెబ్బతింది. ఇరాన్ డ్రోన్ తాకిడికి ఒమన్‌లోని సలాలహ్ పోర్టులో స్వల్పనష్టం వాటిల్లింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై శుక్రవారం ఇరాన్ ఆరు క్షిపణులు, 15 డ్రోన్లతో చేసిన దాడుల్లో 15 మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. అందులో ఐదుగురికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ఇటీవలి దాడుల్లో 500మంది అమెరికా సైనికులు గాయపడ్డట్లు ఇరాన్ ప్రకటించింది. ఖర్గ్ ద్వీపాన్ని ముట్టడిస్తే ఒక్క అమెరికా సైనికుడు కూడా ప్రాణాలతో వెళ్లరని తేల్చిచెప్పింది. అరబ్ దేశాలు సురక్షితంగా ఉంటూ, అభివృద్ధి పథంలో నడవాలంటే, వారి భూభాగం నుంచి తమపై అమెరికా దాడులు చేయకూడదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రకటన విడుదల చేశారు. ఇరాన్‌లోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో జరుగుతున్న దాడులు పెద్ద అణు ప్రమాదానికి దారితీయవచ్చని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తాజాగా హెచ్చరించింది. అయితే ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా మరిన్ని దాడులు చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇస్లామాబాద్‌లో సమావేశమవ్వాలని సౌదీఅరేబియా, తుర్కియే, ఈజిప్టు, పాకిస్థాన్ విదేశాంగమంత్రులు నిర్ణయించారు.

# కనగర్తి గ్రామంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహణ...

### ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...

### ఎస్సై దీకొండ రమేష్..




ఓదెల//మార్చి 28 (ఆకాంక్ష) : రోడ్డు ప్రమాదాలను తగ్గించడంతో పాటు వాహనదారుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు పోత్కపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఓదెల మండలం కనగర్తి గ్రామంలో శనివారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, వాహనదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ వినియోగించాలనీ సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం ప్రమాదకరమని, మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తీవ్రమైన ప్రమాదాలు సంభవించే అవకాశముందని హెచ్చరించిన ఆయన, బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్) కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు సంబంధించినవని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం కీలకమని, వాహన దారులు అప్రమత్తంగా ఉండి నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని ఎస్సై దీకొండ రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.